మన క్రాంతి

KR TV

ఇది వాస్తవ పత్రిక...

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :52 | బుధవారం , 22 జనవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-







## సీఎం, మంత్రుల తప్పుడు ప్రచారం

# తేటతెల్లమైంది

### నీటి వాటాలపై కేసీఆర్ వాదనే వినిపించిన రేవంత్ సర్కార్



**హైదరాబాద్,21జనవరి(క్రాంతిన్యూస్):** కృష్ణా నీళ్లలో తెలంగాణకు న్యాయమైన వాటా దక్కకుండా కేసీఆర్ అన్యాయం చేశారని.. 299 టీఎంసీలు తీసుకునేందుకు అంగీకరించి తీవ్ర నష్టం చేశారని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోన్న వాదన తప్పని తేలిపోయింది.

మంగళవారం జలసౌధలో నిర్వహించిన కేఆర్ఎంబీ 19వ సమావేశంలో గతంలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన వాదననే ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వమూ వినిపించింది. అంతకన్నా ఒక్క లైన్ కూడా అదనంగా చెప్పలేకపోయింది. అడహక్ అగ్రిమెంట్‌కు ట్రిబ్యునల్ కు తేడా తెలియకుండా సీఎం, ఇరిగేషన్ శాఖ మంత్రి అడ్డగోలుగా మాట్లాడారని.. వారి వాదననే పీసీసీ చీఫ్ కాంగ్రెస్ పార్టీ స్టాండ్ గా మాట్లాడటమే కాదు పత్రికల్లో వ్యాసాలు రాసి అందరిముందు నవ్వుల పాలయ్యారని తేటతెల్లమైంది.

2లో

# దావోస్‌లో తొలి ఒప్పందం



స్విట్జర్లాండ్?లోని దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఇఎఫ్) 2025 వార్షిక సదస్సులో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల వేట ప్రారంభమైంది. ఈ మేరకు దావోస్?లో తెలంగాణ ప్రభుత్వం తొలి ఒప్పందం కుదుర్చుకుంది. దావోస్‌లో యూనిలీవర్ సీఈఓ హీన్ షూమేకర్, చీఫ్ సప్లై చైన్ ఆఫీసర్ విల్లెం ఉయిజెన్‌తో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి , ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు , అధికారుల బృందం మంగళవారం సమావేశమయ్యారు. యూనిలీవర్ వంటి గ్లోబల్ FMCG దిగ్గజ సంస్థ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం, వ్యాపార అవకాశాలపై సీఎం రేవంత్ బృందం చర్చించారు. ఈ మేరకు దావోస్ పర్యటనలో తొలి ఒప్పందం చేసుకున్నారు.యూనిలివర్ కంపెనీ గ్లోబల్ సీఈవోతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన చర్చలు విజయవంతమయ్యాయని తెలంగాణ ప్రతినిధుల బృందం తెలిపారు. వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచంలోనే పేరొందిన బ్రాండ్‌లలో ఒకటైన యూనిలీవర్ తెలంగాణలో పెట్టుబడులకు సంసిద్ధత వ్యక్తం చేసిందని చెప్పారు. తెలంగాణలో తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రపంచ దిగ్గజ సంస్థ యూనిలీవర్ ఒప్పందం కుదుర్చుకుందని అన్నారు. కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు అంగీకరించిందని చెప్పారు. తెలంగాణలో బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు కూడా సంసిద్ధత వ్యక్తం చేసిందని సీఎం రేవంత్ బృందం పేర్కొన్నారు.

2లో

## ఒకే రోజు నలుగురిని పొట్టన పెట్టుకున్న ప్రభుత్వం : కేటీఆర్



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , మాజీ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఒకే రోజు నలుగురు రైతులను పొట్టన పెట్టుకున్న ప్రభుత్వమిదని.. రైతు రాజ్యం కాదిది.. రైతు వంచన కొనసాగిస్తున్న రాజ్యమిదని దుయ్యబట్టారు. ముమ్మాటికీ రైతులను ఆదుకునే సంక్షేమ ప్రభుత్వం కాదని, తోడేళ్ళలా ప్రాణం తీసే క్రూరత్వాన్ని నింపుకున్న ఇందిరమ్మ రాజ్యమిదని అన్నారు. "కాంగ్రెస్ కాదు ఇది ఖూనీకోర్.. ఆత్మహత్యలు కాదివి ముమ్మాటికి మీరు చేసిన హత్యలు.. రుణమాఫీ చేయకుండా తీసిన ప్రాణాలు.. రైతుబంధు వేయకుండా చేసిన ఖూనీలు.. ఆ కుటుంబాల మనోవేదనలే మీ సర్కారుకు మరణ శాసనం రాస్తాయి..

2లో

# మా పథకాలు.. మా ఇష్టం



కాంగ్రెస్ కార్యకర్తలు చెప్పినోళ్లకే ప్రభుత్వ పథకాలని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ సంచలన వ్యాఖ్యలు

ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు గందరగోళం మధ్య కొనసాగుతున్నాయి. దీనికి కారణం ఎందుకు అధికారపార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు చేసిన వ్యాఖ్యలు చూస్తే తెలుస్తుంది. మా ప్రభుత్వంలో మా ఇష్టం అన్నట్టు నేతలు వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు చెప్పిన వాళ్లకే ప్రభుత్వ పథకాలు వస్తాయని బహిరంగ ప్రకటనలు చేస్తున్నారు. అధికారులు మా మాట వినకుంటే ఏ ఊరిలో ఏ ఒక్క ప్రభుత్వ పథకం అమలు కాలని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చెప్పిన వాళ్లకే ప్రభుత్వ పథకాల అని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

2లో

## రియల్ ఎస్టేట్ ఏజెంట్ చెంప చెల్లుమనిపించిన ఎంపీ ఈటల



బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. పేదల భూములను కబ్జా చేశారంటూ రియల్ ఎస్టేట్ ఏజెంట్‌పై ఈటల చేయి చేసుకున్నారు. మల్కాజ్‌గిరి జిల్లా, పోచారం మున్సిపాలిటీ పరిధిలో ఏకశిలనగర్‌లో పేదలను ఇబ్బందులు పెడుతున్న రియల్ ఎస్టేట్ బ్రోకర్‌పై ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు కబ్జా చేసి పేదలకు అన్యాయం చేస్తున్నారని తెలసి.. ఆ ప్రాంతాన్ని పరిశీలించడానికి మంగళవారం ఈటల వెళ్లారు. ఈ క్రమంలో ఎంపీని అడ్డుకుంటామని, టెంట్లు కూడా తగలబెడతామని రియల్ ఎస్టేట్ బ్రోకర్లు అన్నారు.

2లో

## ఆరు గ్యారంటీలపై నిలదీత

### గందరగోళం మధ్య కొనసాగుతున్న గ్రామ సభలు



ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న గ్రామ సభలు, వార్డు సభలు గందరగోళం మధ్య కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు పథకాలకు గ్రామ సభల్లో దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న సభల్లో ప్రజలు, అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంటున్నది. సూర్యాపేట జిల్లా మోతే మండలం సిరికొండ గ్రామంలో అర్హులైన వారికి రేషన్ కార్డులు రాలేదని అధికారులను నిలదీశారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం అయ్యంగారిపల్లిలో గ్రామసభలో ఆరు గ్యారెంటీలపై అధికారులను నిలదీశారు.

## గరియాబంద్‌లో భారీ ఎన్‌కౌంటర్.. 20 మంది మావోయిస్టులు మృతి

5లో

# ‘లోకేష్ డిప్యూటీ సీఎం’ అన్న వారి నోరు మూయించిన పవన్ కళ్యాణ్



పార్టీలో లోకేష్ డిప్యూటీ సీఎం చేయాలన్న స్లోగన్ బలంగా వినిపించింది. భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అయితే.. డిప్యూటీ సీఎం కాదు.. ఏకంగా ముఖ్యమంత్రి పదవికి లోకేష్ అర్హుడు అంటూ సంచలన ఆరోపణలు చేశారు. అది కూడా సీఎం చంద్రబాబు ఎదుట అలా అనడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. మరోవైపు ఈరోజు తెలుగుదేశం పార్టీ ప్రత్యేక ప్రకటన ఇవ్వాల్సి వచ్చింది. ఇకముందు ఇలాంటి ప్రకటనలు వద్దు అంటూ పార్టీ శ్రేణులకు ఆదేశాలు ఇచ్చే దాకా పరిస్థితి వచ్చింది. తొలుత మహాసేన రాజేష్ ఈ తేనె తుట్టను కదిపారు. డిప్యూటీ సీఎం పోస్టుకు లోకేష్ అర్హుడు అంటూ వ్యాఖ్యానించారు. అవి క్రమేపీ విస్తరించాయి. రెడ్డప్ప గారి శ్రీనివాసులు రెడ్డి, బుద్దా వెంకన్న, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పిఠాపురం వర్మ తదితరులు లోకేష్ ను డిప్యూటీ సీఎం పదవికి ఎంపిక చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. చివరకు అనంతపురంలో సీఎం చంద్రబాబు ఎదుటే సీనియర్ నేత కాల్వ శ్రీనివాసులు సైతం డిమాండ్ చేయడం విశేషం. అయితే ఉన్నట్టుండి టిడిపి హై కమాండ్ దీనిపై స్పందించి ప్రచారానికి బ్రేక్ చేసింది. అయితే తెలుగుదేశం పార్టీ ఈ విషయంలో ఎందుకు వెనక్కి తగ్గింది అన్నది ఇప్పుడు చర్చ.

2లో

# రేవంత్‌కు షాక్?

### రివెంజ్ పాలిటిక్స్ మంచివి కాదు - జగ్గారెడ్డి




తెలంగాణలో రాజకీయాలు రోజు రోజుకు రసవత్తరంగా మారుతున్నాయి. ప్రతిపక్ష నేతలపై కేసులు, విచారణలు, అరెస్టులతో పాలిటిక్స్ హాట్ హాట్‌గా మారుతున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీద ఏసీబీ, ఈడీ విచారణలు నడుస్తున్న విషయం తెలిసిందే. మరోవైపు.. పాడి కౌశిక్ రెడ్డి లాంటి ఎమ్మెల్యేలను అరెస్టులు చేస్తున్నారు.

2లో

## నేటిమాట

మన దేశంలో మనిషిని మనిషిలా చూసేది భూమి ఒకటే ఏ కులపోడు పండించినా పండుతుంది ఏ కులపోడు చనిపోయినా తనలోకి తీసుకోంటుంది



-మహాకవి శ్రీ శ్రీ

## మీది ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాలన..

### ప్రజలు ఆగ్రహం అర్థమైందా?


ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో ఇప్పటికైనా అర్థమైందా?.. కాంగ్రెస్ ప్రజాపాలనపై హరీశ్‌రావు సీరియస్

ప్రజాపాలన కాదు, మీది ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాలన అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. మీ సోకాల్డ్ ప్రజాపాలన పట్ల ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో ఇప్పటికైనా అర్థమైందా అని ప్రశ్నించారు.

2లో

# ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు గుండెపోటు

సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు స్వల్ప గుండెపోటు వచ్చింది. గుండెపోటు రావడంతో డెహ్రాడూన్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. వైద్యులు ఆయనకు స్టంట్ వేశారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. అయితే డెహ్రాడూన్ పర్యటనలో పద్మారావు గౌడ్ ఉన్నారు. ఈరోజు రాత్రి హైదరాబాద్‌కు పద్మారావు రానున్నారు. మూడు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి డెహ్రాడూన్ టూర్‌కు పద్మారావు గౌడ్ వెళ్లారు. పద్మారావు గౌడ్‌కు గుండెపోటు వచ్చిందని తెలియడంతో బీఆర్ఎస్ నేతలు ఆందోళన చెందారు.



3లో

## దెబ్బతిన్న జూరాల క్రస్ట్ గేట్లు.. భారీగా లీకవుతున్న నీళ్లు



3లో

# సీఎం, మంత్రుల తప్పుడు ప్రచారం తేటతెల్లమైంది

## నీటి వాటాలపై కేసీఆర్ వాదనే వినిపించిన రేవంత్ సర్కార్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్,21 జనవరి (క్రాంతిన్యూస్ ): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిన 811 టీఎంసీల నికర జలాల్లో అప్పటికే ఉన్న వినియోగం ఆధారంగా ఒక్క ఏడాది కోసం 34:66 నిష్పత్తిలో అంటే 299 టీఎంసీలు తెలంగాణకు, 512 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్ వినియోగించుకునేలా అడహాక్ వర్కింగ్ అరెంజ్‌మెంట్ చేసుకున్నారు. వివిధ కారణాలతో అదే అగ్రిమెంట్ కొనసాగుతూ వస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రస్తుత వాటర్ (2024 -25)లోనూ అదే అడహాక్ అగ్రిమెంట్ ప్రకారం నీటి వినియోగం కొనసాగుతోంది.

కేఆర్ఎంబీ సమావేశంలో 66:34 నిష్పత్తిలో నీటి పంపకాలకు తాము అంగీకరించబోమని తెలంగాణ ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జా తెలిపారు. క్యాచ్‌మెంట్, బేసిన్ ఆధారంగా తెలంగాణకు 71 శాతం నీటి వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని కేడబ్ల్యూడీటీ -2 తేల్చాల్సి ఉన్నందున అప్పటి వరకు రెండు రాష్ట్రాలకు చెరిసగం నీటి పంపకాలు చేయాలని కోరారు. సరిగ్గా ఇదే డిమాండ్ ను కేసీఆర్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో పాటు కేఆర్ఎంబీ సమావేశాల్లో వినిపిస్తూ వచ్చింది. నీటి పంపకాలను ట్రిబ్యునల్ తేల్చాలి కాబట్టి అప్పటి వరకు 66:34 నిష్పత్తిలోనే వర్కింగ్ అరెంజ్‌మెంట్ కొనసాగిస్తే మంచిదని కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్ జైన్ సూచించారు. పరిస్థితులను బట్టి తెలంగాణ వాటా కొంచెం పెంచే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ వాదనకు ఏపీ ససేమిరా అంది. 50 శాతం నీటి వాటా ఇచ్చేందుకు ఒప్పుకోబోమని చెప్పింది. దీంతో ఇప్పుడున్న వర్కింగ్ అరెంజ్‌మెంట్ కొనసాగింపునకు బోర్డు చైర్మన్ మొగ్గు చూపారు. నాగార్జున సాగర్ పై సీఆర్పీఎఫ్ బలగాలను ఉపసంహరించాలనే అంశంపై చర్చ సందర్భంగా బోర్డు చైర్మన్ స్పందిస్తూ రెండు రాష్ట్రాలు అందుకు అంగీకరిస్తే తాము కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు.

ఏదైనా నది జలాల్లో వాటా తేల్చాల్సింది ట్రిబ్యునళ్లే తప్ప ప్రభుత్వాలు కదాన్న విషయం గుర్తించడంలో సీఎం రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫెయిల్ అవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేసీఆర్ సంతకం పెట్టారు.. హరీశ్ రావు సంతకాలు పెట్టారు అంటున్న డాక్యుమెంట్ టెంపరరీ వర్కింగ్ అరెంజ్‌మెంట్ మాత్రమే.. దానికి చట్టబద్ధత లేదు. చట్టబద్ధంగా నీటి వాటాలు తేల్చాల్సిన ట్రిబ్యునల్ సాధన కోసం కేసీఆర్ తన పదేళ్ల పాలనలో అన్ని స్థాయిలో ప్రయత్నించారు. కేంద్రం దిగిరాకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అలాగే కేంద్రంపై ఒత్తిడిని కొనసాగించారు. ఫలితంగానే రెండో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం కేసీఆర్ వాదనతో ఏకీభవించి కృష్ణా జలాల పంపకాలపై ట్రిబ్యునల్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఆ సమావేశం మినిట్స్‌లోనే తెలంగాణ సీఎం కేసీఆర్ ఇంటర్ స్టేట్ వాటర్ డిస్ప్యూట్స్ యాక్ట్ -1956లోని సెక్షన్ 3 ప్రకారం కృష్ణా జలాల పంపిణీపై ట్రిబ్యునల్ వేయాలని పట్టుబట్టారని.. ఆయన కోరినట్టుగానే ఈ అంశాన్ని ట్రిబ్యునల్ కు రెఫర్ చేస్తూ టీవోఆర్ ఇస్తామని పేర్కొన్నారు. ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలంటే తెలంగాణ ఈ అంశంపై సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్ విత్ డ్రా చేసుకోవాలని కోరారు. ఈ మొత్తం ప్రక్రియకు మూడేళ్లు పట్టింది. 2023 అక్టోబర్ లో కేంద్రం ట్రిబ్యునల్ ఏర్పాటు చేసింది. అది కూడా తమ ఘనతేనని చెప్పుకునే ప్రయత్నంలో రేవంత్ రెడ్డి తప్పుడు వాదనలతో ప్రజలను పక్కదోవ ప్రయత్నం చేసింది. కానీ వారి ప్రయత్నం కొన్ని రోజుల్లోనే బూడిదలో పోసిన పన్నీరు అయ్యింది. కేఆర్ఎంబీ మీటింగ్ సాక్షిగా సీఎం, ఇరిగేషన్ శాఖ మంత్రుల వాదన రాజకీయ ఆరోపణలే తప్ప వాస్తవం కాదని ఇరిగేషన్ సెక్రటరీ చెప్పిన అంశాల ఆధారంగా తేటతెల్లం అయ్యింది.

## దావోస్‌లో తొలి ఒప్పందం

మొదటి పేజీ తరువాయి

కాగా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జనవరి 16 నుంచి 19 వరకు సింగపూర్, 20 నుంచి 22 వరకు దావోస్‌లో పర్యటించనున్నారు. ఆయన వెంట మంత్రి శ్రీధర్‌బాబు ఉంటారు. సింగపూర్‌లో స్కిల్ యూనివర్సిటీతో ఒప్పందాలు చేసుకుంటారు. దాంతోపాటు.. పలు సంస్థలతో పెట్టుబడులపై సంప్రదింపులు జరుపుతారు. దావోస్‌లో జరగనున్న డబ్ల్యూఈఎఫ్ సందర్భంగా ప్రవాస భారతీయులతో భేటీకానున్నారు. గత ఏడాదితో పోలిస్తే.. ఈసారి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళికలను రూపొందించినట్లు తెలుస్తోంది.



# ఒకే రోజు నలుగురిని పొట్టన పెట్టుకున్న ప్రభుత్వం: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

. వారి కన్నీళ్లే కపట సర్కార్‌ను కూల్చి వేస్తాయి" అంటూ కేటీఆర్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

## రైతు ఆత్మహత్యలపై అధ్యయన కమిటీ..

రాష్ట్రంలో ఆందోళనకర స్థాయికి చేరిన రైతు ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభ పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు బీఆర్ఎస్ తరఫున ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో 9 మందితో ఏర్పాటుచేసిన ఈ కమిటీలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, జోగు రామన్న, పువ్వాడ అజయ్, ఎమ్మెల్సీలు కోటిరెడ్డి, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, రసమయి బాలకిషన్, అంజయ్య యాదవ్ ఉన్నట్లు తెలిపారు. ఈ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా రెండు వారాలపాటు విస్తృతంగా పర్యటించి రైతు ఆత్మహత్యలకు గల కారణాలను గుర్తిస్తుందని చెప్పారు. ఏడాదిలో వ్యవసాయ సంక్షోభానికి దారితీసిన పరిస్థితులను పరిశీలించి ఒక నివేదికను తయారు చేస్తుందని వివరించారు. క్షేత్రస్థాయి దుర్భర పరిస్థితులను అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి, వ్యవసాయశాఖ మంత్రికి, బీఆర్ఎస అధినేత కేసీఆర్‌కు నివేదికను అందజేస్తుందని తెలిపారు.

కాంగ్రెస్ నిర్లక్ష్య పాలనలో ఆత్మహత్యలు విపరీతంగా పెరిగిపోయాయని ఇప్పటికే 400 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకోవడం ఆందోళనకరమన్నారు. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చ్చేసలా ప్రధాన ప్రతిపక్షంగా తమ వంతు పాత్ర పోషించాలన్న సదుద్దేశంతోనే ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు కేటీఆర్ వెల్లడించారు. ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ ప్రశ్నిస్తూ.. రేవంత్‌రెడ్డికి చుక్కలు చూపించాలని, ఒక కార్మికునికి కష్టం వేస్త అందరూ కలిసి ఉద్యమించాలని కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ కార్మిక విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. క్యాలెండర్‌ను తేదీలు మారేదిగా కాకుండా.. పోరాటాలు చ్చేసలా విధంగా ఉపయోగించాలన్నారు. మే 1 కార్మిక దినోత్సవం వరకు ప్రభుత్వం తమహామీలు అమలు చేసేలా 15 రోజులకో కార్యక్రమాన్ని రూపకల్పన చేసుకొని ఉద్యమించాలని సూచించారు.

# మా పథకాలు.. మా ఇష్టం

మొదటిపేజీ తరువాయి

దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ పెద్దలు, కార్యకర్తలు చెప్పిన వారికే ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు ఇస్తామన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు లిస్ట్ రెడీ చేసి స్థానిక ఎమ్మెల్యేకి ఇస్తే ఎమ్మెల్యే ఎంపిక చేసిన లిస్ట్ మాత్రమే ఫైనల్ చేయాలి అని అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

గ్రామ సభ లిస్ట్ కాకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఇచ్చిన లిస్ట్ మాత్రమే బయట పెట్టాలి అని జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్,డీపీవోకి ఆదేశాలు జారీ చేసినట్టు కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి తెలిపారు. ఏదైనా గ్రామంలో తమ కార్యకర్తలు చెప్పినట్టు వినకుండా అధికారులు లబ్ధిదారుల లిస్ట్ బయట పెడితే అ గ్రామంలో ఎవ్వరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు రాకుండా చేస్తానని బహిరంగ హెచ్చరించారు. ఏ ప్రభుత్వ పథకం అయినా కాంగ్రెస్ కార్యకర్తలు చెప్పిన వారికే ఇస్తాం మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. ఇందిరమ్మ కమిటీలో ఉన్న 5 మంది సభ్యులు చెప్తే రేవంత్ రెడ్డి చెప్పినట్లే అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల, నేత వ్యాఖ్యలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిజమైన అర్హులకే పథకాలు చేరాలన్న ఉద్దేశంతోనే గ్రామసభలు నిర్వహిస్తున్నామంటున్న ప్రభుత్వ ప్రకటనలు ఉత్తమాటలేనని తేలిపోయిందని స్పష్టమవుతున్నది.

నాలుగు పథకాల్లో అనర్హులను లబ్ధిదారుల్లో చేరుస్తున్నారని ప్రజలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామసభల్లో అధికారులను నిలదీస్తున్నారు. 4 పథకాలకు దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపికను చేపడుతున్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు దరఖాస్తులు స్వీకరించి గ్రామాల్లోనే లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే దీనికి భిన్నంగా గ్రామాల్లో పరిణామాలు జరుగుతున్నాయి. ఆరు గ్యారెంటీలు, రేషన్ కార్డుల కోసం ప్రజలు అధికారులను ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. 4 పథకాలకు దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపికను చేపడుతున్న సభల్లో అధికారులకు, ప్రజల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంటున్నది.

## రియల్ ఎస్టేట్ ఏజెంట్ చెంప చెల్లుమనిపించిన ఎంపీ ఈటల

మొదటి పేజీ తరువాయి

ఎవరైనా పేదలపై దౌర్జన్యం చేస్తే ఖబర్దార్ అంటూ ఎంపీ ఈటల రాజేందర్ రియల్ ఎస్టేట్ బ్రోకర్లను హెచ్చరించారు. బ్రోకర్లకు అధికారులు కొమ్ముకాస్తున్నారని, పేదల స్థలాలకు బీజేపీ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. నారపల్లి, కొర్రముల గ్రామాలల్లో పేద ప్రజలు కంచెలు, జంగల్ భూములు కొనుక్కొని ఇళు కట్టుకుని ఉంటున్నారు. అయితే 149 ఎకరాల్లో ఇళ్లలు కట్టుకుని చాలా మంది అమ్ముకున్నారు. కానీ అమ్మిన తర్వాత కొత్తగా కొనుగోలు చేసినవారే ల్యాండ్‌ను కూడా లాక్కునే ప్రయత్నం చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్లతో వాళ్ల కబ్జాలకు కూడా పాల్పడుతున్నారని ఎంపీకి ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో ఈటల రాజేందర్ అక్కడికి వెళ్లారు. ఆయన భూములు పరిశీలిస్తున్న క్రమంలో రియల్ ఎస్టేట్ బ్రోకర్ వచ్చి ఆందోళన చేసి.. వాగ్వాదానికి దిగారు. దీంతో ఒక్కసారిగా ఆగ్రహానికి గురైన ఈటల బ్రోకర్‌పై దాడి చేశారు. తర్వాత బీజేపీ కార్యకర్తలు కూడా బ్రోకర్‌పై దాడి చేశారు. పేదల భూమల కబ్జాపై కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

కాగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి ఆరోపణలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై బీజేపీ జాతీయ నాయకత్వం ఆరా తీసింది. పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు లక్ష్యమేంటి.. ఎవరెవరికి సమన్లు జారీ చేస్తోంది? ఏయే అంశాలపై కమిషన్ విచారణ జరుపుతోంది? వంటి వివరాలను తక్షణం తమకు అందించాలని రాష్ట్రపార్టీ నాయకత్వాన్ని ఆదేశించింది. మాజీ మంత్రి ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌కు నోటీసులు జారీ చేసే అవకాశముందంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ అంశంపైనా నివేదిక ఇవ్వాలని సూచించింది. దీంతో, నాలుగు పేజీల అత్యవసర నివేదికను పార్టీ రాష్ట్ర నేతలు సోమవారమే జాతీయనాయకత్వానికి పంపించారు. ఈ నివేదికలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలను వివరించింది.

కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ వచ్చిన ఆరోపణల నిగ్గు తేల్చేందుకు పీసీ ఘోష్ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్.. కాళేశ్వరం ప్రాజెక్టు పనులతో సంబంధమున్న నీటిపారుదల శాఖతో పాటు ఆర్థికశాఖ ఉన్నతాధికారులను విచారించింది. 2014-17 మధ్యలో కాళేశ్వరం పనులు జరిగినప్పుడు అప్పటి నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు, అప్పటి ఆర్థిక మంత్రి, ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌కు కూడా కమిషన్ సమన్లు జారీ చేసే అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర నాయకత్వం



ఆ నివేదికలో పొందుపరచినట్లు తెలిసింది. మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు అప్పటి నీటిపారుదల, ఆర్థిక మంత్రులను విచారించే అవకాశం ఉందని రాష్ట్ర పార్టీ నివేదించినట్లు సమాచారం.

# ఆరు గ్యారంటీలపై నిలదీత

## గందరగోళం మధ్య కొనసాగుతున్న గ్రామ సభలు



మొదటి పేజీ తరువాయి

రెండు లక్షల రుణ మాఫీ కాలేదు.. తులం బంగారం ఇవ్వలేదు.. రైతు భరోసాకు ఇంతవరకు జాడ లేదు అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మాదాబాద్ మండలం వెంకటరెడ్డిపల్లి గ్రామసభలో అర్హులైన లబ్ధిదారులకు ఆత్మీయ రైతు భరోసా జాబితాలో పేర్లు రాలేదని అసలైన లబ్ధిదారులు రెవెన్యూ అడిసషనల్ కలెక్టర్ ముందు గ్రామస్తులు ఆందోళన చేపట్టారు.

అయితే జనం నోర్లు మూయించేందుకు పోలీసులు రంగంలోకి దిగి బలవంతంగా అడ్డుకుంటున్నట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రభుత్వం డ్రామాలు ఆడుతుందంటూ ప్రజలు మండి పడుతున్నారు. మార్పు కోసం కాంగ్రెస్‌కు ఓటేస్తే మా బతులకును ఆగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ నెల24 వరకు గ్రామ సభలు కొనసాగనున్నాయి.

# 'లోకేష్ డిప్యూటీ సీఎం' అన్న వారి నోరు మూయించిన పవన్ కళ్యాణ్

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో మూడు పార్టీలు ఉమ్మడిగా ముందుకు వెళుతున్నాయి. కూటమి దశాబ్ద కాలం పాటు కొనసాగాలని భావిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో కూటమి కట్టక ముందే ఒక ఒప్పందానికి వచ్చాయి. కూటమి అధికారంలోకి వస్తే చంద్రబాబు సీఎం కావాలని, పవన్ కళ్యాణ్ కు డిప్యూటీ సీఎం ఇవ్వాలని, మిగతా నేతలకు ఇతర పదవులు పంపకాలు చేసుకోవాలని అప్పట్లో నిర్ణయించారు. పవన్ కళ్యాణ్ కు ఏకైక డిప్యూటీ సీఎం హోదా ఇస్తేనే గౌరవం అని అంతా ఏకాభిప్రాయానికి వచ్చారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కాకమునుపే లోకేష్ ను డిప్యూటీ సీఎం చేయాలన్న డిమాండ్ తెరపైకి రావడం విశేషం. కేవలం లోకేష్ టీం గా భావించే నేతలే ఈ తరహా వ్యాఖ్యానాలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

వాస్తవానికి తెలుగుదేశం పార్టీలో ఇప్పుడు సుప్రీం లోకేష్. ఎవరు అంగీకరించినా.. అంగీకరించక పోయినా ఇది వాస్తవం. అయితే తెలుగుదేశం పార్టీ పరంగా లోకేష్ ముందంజలో ఉండాలని కోరుకోవడం తప్పులేదు. పైగా నామినేటెడ్ పదవుల పంపకాలు జరుగుతున్న ఇటువంటి సమయంలో.. లోకేష్ ప్రాపకం కోసం ఇలా మాట్లాడిన నేతలు ఉన్నారు. కానీ ఒకేసారి ఒక వ్యూహం ప్రకారం నేతలంతా లోకేష్ ను డిప్యూటీ సీఎం చేయాలని కోరడం మాత్రం.. తెర వెనుక ఏదో జరుగుతోందన్న అనుమానాలు పెరిగాయి. సాధారణంగా టిడిపి అనుకూల మీడియా స్ట్రాటజీ ఒకలా ఉంటుంది. ఇప్పుడు డిప్యూటీ సీఎం చేయాలన్న ప్రతిపాదన కూడా అనుకూల మీడియా నుంచి వచ్చింది. సానుకూలత వస్తే ఒకలా.. లేకుంటే మరోలా వెళ్లడం టిడిపి స్ట్రాటజీ కూడా. లోకేష్ కు డిప్యూటీ సీఎం హోదా విషయంలో కూడా అదే జరిగి ఉంటుందన్న అనుమానాలు ఉన్నాయి.

అయితే లోకేష్ ను డిప్యూటీ సీఎం చేయాలన్న ప్రచారంపై వ్యతిరేకత ఎక్కడి నుంచి వచ్చింది అన్నది ప్రశ్న. ప్రజలు పట్టించుకునే స్థితిలో లేరు. లోకేష్ తనను తాను ప్రూవ్ చేసుకున్నారు. మంగళగిరిలో భారీ మెజారిటీతో గెలిచారు. మంత్రిగా కూడా మంచి మార్కులు పడ్డాయి. ఆయన విషయంలో ఎవరికీ అభ్యంతరాలు ఉంటాయి. జనసేన తో పాటు పవన్ కళ్యాణ్ కు మాత్రమే ఉంటాయి అన్నది ఒక అనుమానం. వాస్తవానికి డిప్యూటీ సీఎం అనేది గౌరవం మాత్రమే. టిడిపి హయాంలో ఇద్దరు డిప్యూటీ సీఎంలు ఉండేవారు. వైసిపి హయాంలో అయితే ఏకంగా ఐదుగురిని నియమించారు. వాస్తవానికి పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం అయిన తర్వాతే ఆ పదవికి ఎంతో కొంత గౌరవం పెరిగింది. చంద్రబాబు తర్వాత అంతటి ఇమేజ్ పొందగలుగుతున్నారు పవన్. అందుకే ఆ గౌరవం కోసం పరితపిస్తున్నారు తెలుగుదేశం నేతలు. అయితే ఇన్ని రోజులు సైలెంట్ గా ఉన్న పవన్.. తిరుపతి నేత కిరణ్ రాయల్ తో కౌంటర్ ఇప్పించినట్లు ప్రచారం నడుస్తోంది. లోకేష్ డిప్యూటీ సీఎం కావాలని టిడిపి నేతలు ఎలా కోరుకుంటున్నారో.. అలాగే జనసేన నాయకులు కూడా పవన్ కళ్యాణ్ సీఎం కావాలని కోరుకుంటున్నారని కిరణ్ రాయల్ చేసిన కామెంట్స్ సంచలనం రేపాయి. అయితే కిరణ్ రాయల్ ప్రకటన నేపథ్యంలోనే తెలుగుదేశం పార్టీ.. లోకేష్ కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలన్న ప్రకటనలను మానుకోవాలని సూచించడం విశేషం. ఈ విషయంలో టిడిపి ఎలా వెనక్కి తగ్గడం వెనుక పవన్ ప్లాన్ సక్సెస్ అయినట్లు ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.



# మీది ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాలన..

## ప్రజలు ఆగ్రహం అర్థమైందా?

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ఎంతో ఆడంబరంగా నిర్వహిస్తున్న గ్రామ సభల సాక్షిగా మీ ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత తేటతెల్లమైందని అన్నారు.

ఊరూరా తిరగబడుతున్న జనం, ఎక్కడిక్కడ నిలదీస్తున్న ప్రజానీకాన్ని చూస్తే కాంగ్రెస్ ఏడాది పాలన పెద్ద ఫెయిల్యూర్ అని అర్థమవుతున్నదని హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశాల్లో, మంత్రులందరూ పక్క రాష్ట్రాల్లో బిజీగా ఉంటే ప్రజలను ఎవరు పట్టించుకోవాలని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహారా నడుమ గ్రామ సభలు నిర్వహించాల్సిన దుస్థితి రావడం దారుణమని అన్నారు. పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఒకవైపు గ్రామ సభలు నిర్వహిస్తుంటే, మరోవైపు కార్యకర్తలకే పథకాలు ఇస్తామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు చెప్పడం సిగ్గుచేటు అని విమర్శించారు. అలాంటపుడు గ్రామ సభలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నట్లేనా? అర్హులైన వారికి పథకాలు ఎగ్గొడుతున్నట్లేనా? అని నిలదీశారు.

ఎన్నికల ముందు హామీలిస్తం.. అధికారంలోకి వచ్చాక ఎగ్గొడుతం అన్నట్లుగా వ్యవహరిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్‌ను హరీశ్‌రావు హెచ్చరించారు. రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు.. అర్హులైన అందరికీ ఇస్తామని చెప్పి ఇప్పుడు భారీ కోతలు విధిస్తే ప్రజలు తిరగబడకుండా ఏం చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల పాపం, అధికారులకు శాపంగా మారిందని.. ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు.

మీరు నిర్వహిస్తున్న గ్రామ సభలు దగా.. ఆరు గ్యారెంటీలు అమలు దగా.. రుణమాఫీ చేయడం దగా.. పంట బోనస్ ఇవ్వడం దగా.. రైతు భరోసా అమలు దగా.. రేషన్ కార్డుల జారీ దగా.. ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక దగా అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఏడాది కాలంలో మీరు చేసిన దగాను ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. మీరు చేసిన మోసాన్ని, నయవంచనను ప్రజలు తెలుసుకున్నారని తెలిపారు. ప్రశ్నించే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, అరెస్టులు చేసి నోళ్లు మూయిస్తున్నారని ధ్వజమెత్తారు. నేడు యావత్ తెలంగాణ ఏకమై మీ దుర్మార్గ పాలనను నిలదీస్తున్నదని.. అడుగడుగునా ప్రశ్నిస్తున్నదని అన్నారు. మరి ఇప్పుడు వారిపై ఎన్ని కేసులు పెడతరు.. ఎంత మందిని అరెస్టులు చేస్తరని నిలదీశారు. మీ రాక్షస పాలనలో విసిగి, వేసారిపోయిన తెలంగాణ ప్రజలు ఉప్పెనగా ఉద్యమించక ముందే కళ్లు తెరవండని హితవు పలికారు. ప్రతిపక్షాల మీద బురదజల్లడం మాని పరిపాలన మీద దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల హామీలో చెప్పినట్లుగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# రేవంత్ కు షాక్?

## రివెంజ్ పాలిటిక్స్ మంచివి కాదు - జగ్గారెడ్డి

మొదటి పేజీ తరువాయి

ఈ పరిణమాలన్ని చూస్తుంటే.. తెలంగాణలో కూడా రివెంజ్ పాలిటిక్స్ నడుస్తున్నాయంటూ అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే.. కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాజకీయ పరిణామాలపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.సోమవారం (జనవరి 20న) రోజు మీడియాతో చిట్‌చాట్ చేసిన జగ్గారెడ్డి.. రివెంజ్ పాలిటిక్స్ గురించి కీలక వ్యాఖ్యలు చేసారు. కక్ష సాధింపు రాజకీయాలకు తాను వ్యతిరేకం అని జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు. రివెంజ్ పాలిటిక్స్ అనేవి ఏ పార్టీకి కూడా మంచిది కాదని అభిప్రాయపడ్డారు. అధికారం ఉన్నప్పుడు కక్ష సాధింపు రాజకీయాలు చేసే వాళ్లు.. ఆ అధికారం కోల్పోయాక తప్పకుండా బాధపడాల్సిన పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. గత ముఖ్యమంత్రులు.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి.. ఎప్పుడూ కక్ష సాధింపు రాజకీయాలు చేయలేదని చెప్పుకొచ్చారు. ప్రతీకార రాజకీయాలు చేయడం సరికాదని అభిప్రాయపడిన జగ్గారెడ్డి.. తెలంగాణ ప్రజల రక్తంలో కక్షసాధింపు ఉండదని చెప్పుకొచ్చారు.ఇదే క్రమంలో.. ఎవరైనా తనకు నష్టం చేసినా.. తాను మాత్రం ఎవ్వరికీ నష్టం చేయనని జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు. కాకపోతే రాజకీయ యుద్ధం మాత్రం చేస్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఏ రాజకీయ పార్టీ నాయకుడైనా డబ్బులు తీసుకోకుండా నిజాయితీగా రాజకీయం చేస్తున్నట్లుగా ఒప్పుకుంటారా..? అని సంచలన ఆరోపణలు చేశారు. తనతో సహా పైసలు ముట్టుకోకుండా రాజకీయం చేయని నాయకుడెవరూ ఉండరని జగ్గారెడ్డి కీలక ప్రకటన చేశారు. రాజకీయాలకు తప్పకుండా డబ్బు అవసరం అని జగ్గారెడ్డి తెలిపారు.తరచూ.. సొంత పార్టీపై, సొంత పార్టీ నేతలపై సంచలన వ్యాఖ్యలు చేసే జగ్గారెడ్డి.. ఇప్పుడు చేసిన కామెంట్స్ కూడా రేవంత్ రెడ్డి సర్కార్ మీదేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జగ్గారెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణులతో పాటు నెట్టింట కూడా చర్చ నడుస్తోంది.

## ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు గుండెపోటు



మొదటి పేజీ తరువాయి

పద్మారావు గౌడ్ ఆరోగ్యం నికలడగా ఉందని, పూర్తిగా కోలుకున్నారని వైద్యులు తెలియజేయడంతో వారంతా ఊపిరిపీల్చుకున్నారు. మరోవైపు, పద్మారావు గౌడ్ ఇవాళ రాత్రికి సికింద్రాబాద్‌కు తిరిగి వస్తారని తెలియడంతో ఆయన అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు పద్మారావు ఇంటికి చేరుకుంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ పెద్దలు కూడా పద్మారావు గౌడ్ ఆరోగ్యంపై ఆరా తీసినట్లు తెలిసింది.

## దెబ్బతిన్న జూరాల క్రస్ట్ గేట్లు.. భారీగా లీకవుతున్న నీళ్లు

మొదటి పేజీ తరువాయి

ఓ వైపు కృష్ణా నదిలో నీటిని ఆంధ్రప్రదేశ్ అక్రమంగా తరలించుకుపోతున్నా పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్.. మరో వైపు ప్రాజెక్టుల నిర్వహణను గాలికొదిలేయడంతో వృధాగా కృష్ణమ్మ దిగువకు పోతున్నది. తెలంగాణలో కృష్ణా నదిపై ఉన్న తొలి ప్రాజెక్టు అయిన ప్రియదర్శిని జూరాల డ్యామ్ నుంచి నీరు లీక్ అవుతున్నది. ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేయించకపోవడంతో తుప్పు పట్టి, రబ్బర్లు ఊడిపోయాయి. దీంతో మొత్తం 12 క్రస్ట్ గేట్ల నుంచి నీరు దిగువకు పోతున్నది. ఇందులో 8 గేట్ల రోప్ దెబ్బతిన్నది. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో జూరాల ప్రాజెక్టు భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జూరాల ప్రాజెక్టును 1995లో ప్రారంభించారు. 9.68 టీఎంసీల సామర్థ్యంతో దీనిని నిర్మించారు. ఇటీవల కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలకు జలాశయం నిండు కుండలా ఉంది. అయితే పాలకుల నిర్లక్ష్యం ప్రాజెక్టును వెంటాడుతున్నది. క్రస్ట్ గేట్లకు సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో తుప్పుపట్టి గేట్లకు అమర్చిన రబ్బర్లు ఊడిపోయాయి. దీంతో ఆ ప్రాతంలో నీరు లీకవుతుండటంతో క్రమంగా ప్రాజెక్టు ఖాళీ అతువున్నది. వేసవి నాటికి పరిస్థితి ఇలాగే కొనసాగితే జూరాలపై ఆధారపడిన ప్రజలకు నీటి సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నది.

# దెబ్బతిన్న జూరాల క్రస్ట్ గేట్లు.. భారీగా లీకవుతున్న నీళ్లు

**- జూకల్, చల్లగరిగ, సుల్తాన్ పూర్, కర్కపల్లి గ్రామాలల్లో జరిగిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు అర్హుల ఎంపిక కొరకు జరిగిన గ్రామ సభలల్లో ఎమ్మెల్యే..**

**- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..**



చిట్యాల,21 జనవరి (పబ్లిక్ న్యూస్ ):ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 26వ తేదీ నుండి అమలు చేయబోతున్న నాలుగు సంక్షేమ పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రజా ప్రభుత్వంలో అర్హులైన అసలైన లబ్ధిదారులకే అందేలా చూస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుఅన్నారు. ఈరోజు మంగళవారం భూపాలపల్లి నియోజకవర్గం చిట్యాల మండలంలోని జూకల్, చల్లగరిగ, కొత్తపల్లిగోరి మండలంలోని సుల్తాన్ పూర్, గణపురం మండలంలోని కర్కపల్లి గ్రామాలలో జరిగిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు అర్హుల ఎంపికకు సంబంధించి గ్రామ సభలు జరగ్గా, ఆయా గ్రామాలల్లో జరిగిన గ్రామ సభల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయా గ్రామాలల్లో ఏర్పాటు చేసిన గ్రామ సభలల్లో ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 26 నుండి ఈ నాలుగు పథకాలను ప్రారంభించనున్నదని, పథకాల అమలులో భాగంగా ఈరోజు నుండి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలలో గ్రామస్తులను, ఇందిరమ్మ కమిటీలను భాగస్వాములను చేయాలన్నారు. కొత్తగా ప్రారంభించబోయే నాలుగు పథకాలు ఓ అద్భుతమని కార్యక్రమం అని, ఈ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే అన్నారు. రాబోయే నాలుగేళ్లలో పేదవాడి సొంతింటి కల నెరవేర్చే దిశగా ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి మద్దతుగా ఎరుకల సంఘం



తొర్రూరు ,21 జనవరి ( క్రాంతిన్యూస్ ): ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి మద్దతుగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నడిగడ్డ శైలజ పిలుపునిచ్చారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో విశ్రాంతి భవనంలో తెలంగాణ ఎరుకల సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు మాదగాని అనూష అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా నడిగడ్డ శైలజ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మూడున్నర దశాబ్దాలుగా నడుపుతున్న పోరాటానికి ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని సూచించారు. అడ్డుపడే స్వార్థపరుల కుట్రలను తిప్పికొట్టాలని, ఈ ఉద్యమానికి తెలంగాణ ఎరుకల సంఘం పూర్తిగా మద్దతు ఇస్తుందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ సాధనలో తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూతాటి కుమార్ నాయకత్వంలో మహిళా విభాగం భాగస్వామ్యం కలిగి ఉంటుందని ఆమె వివరించారు.

ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో లక్ష డప్పులు - వేల గొంతులు కార్యక్రమం

ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ నిర్వహించే లక్ష డప్పులు-వేల గొంతులు కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చి పాల్గొనాలని శైలజ కోరారు. ప్రజాస్వామిక పోరాటాలకు ఎరుకల సంఘం ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు.

సమాజంలో ఎరుకల వర్గ సమస్యల పరిష్కారం కోసం ప్రజా సంఘాలు ఏకమవ్వాలని, ఎరుకల మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు నడిగడ్డ నాగమణి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నడిగడ్డ బుచ్చమ్మ, నాయకురాలు యాకమ్మ, ప్రియ, గీత తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి క్రీడాకారులను అభినందించిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ధర్మారం ,21 జనవరి (క్రాంతిన్యూస్ ):ధర్మారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల మరియు కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు జాతీయ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా సోమవారం రోజున ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాఠశాలను సందర్శించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన టీ. మనోజ్ఞ ఫుట్ బాల్ క్రీడలో జమ్ము కాశ్మీర్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం జరిగిందని,బి.సింధు ప్రియా వాలీబాల్ క్రీడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో జరిగిన జాతీయ స్థాయిలో పాల్గొనడం జరిగిందని,భీ.వైష్ణవి సాఫ్ట్ బాల్ ఎస్జిఫ్ అండర్ 19 మహారాష్ట్ర ఔరంగాబాద్ లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంనడం జరుగుతుందని అదేవిధంగా ఓ. సౌజ్ఞ శ్రీ గుజరాత్ రాష్ట్రంలో జరిగిన జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనడం జరిగిందని,ఏ రంజిత్ కుమార్ బీహార్ రాష్ట్రంలో జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్నారని అన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా పోలీస్ ఫ్లాగ్ మార్చ్ - ఆసిఫాబాద్ ఎ.ఎస్పి చిత్తరంజన్ ఐ.పి.ఎస్

### జైనూర్ పోలీసుల ఫ్లాగ్ మార్చ్ నిర్వహణ



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జైనూర్ ,21 జనవరి (పబ్లిక్ న్యూస్ ):కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా గౌరవ ఎస్పీ డివి శ్రీనివాసరావు ఐపిఎస్ గారి ఆదేశానుసారం ఈరోజు అసిఫాబాద్ ఏఎస్పి చిత్తరంజన్ ఐపిఎస్ గారి ఆధ్వర్యంలో జైనూర్ సర్కిల్ మరియు ఇతర పోలీస్ సిబ్బందితో జైనూర్ మార్కెట్ ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగింది



. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ ఎఎస్పి చిత్తరంజన్ ఐపిఎస్ గారు మాట్లాడుతూ... భౌగోళిక పరిస్థితులు తెలుసుకోవడం గురించి నిర్వహిస్తున్నట్లు తెలిపినారు. జిల్లాలో ఎలాంటి శాంతిభద్రతల సమస్య , మతఘర్షణలు జరగకుండా ప్రజల భద్రత కోసమే ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఫ్లాగ్




మార్చ్ నిర్వహించడం ద్వారా ప్రజలకు సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ మరియు మేమున్నామనే భరోసా కల్పించడం జరుగుతుందని తెలిపినారు. అదేవిధంగా ప్రజలు కూడా ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా తమ సమస్యలను శాంతిపుర్వకంగా, ప్రజాస్వామ్య మార్గంలో అధికారులకు నివేధించి పరిష్కరించుకోవాలని దానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ తోడు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైనూరు సీఐ రమేష్ , డి.సి.ఆర్.బీ సీ.ఐ సంపత్ , జైనూరు ఎస్సై సాగర్ , లింగాపూర్ ఎస్ఐ గంగన్న, పి ఎస్ఐ లుపాషా, అనిల్ ఇతర పోలీస్ అధికారులు మరియు సిబ్బంది 120 మంది ఫ్లాగ్ మార్చ్ లో పాల్గొనడం జరిగింది.

# ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా 66 వ డివిజన్లో ఈరోజు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.




హాసన్ పర్తి ,21 జనవరి (క్రాంతిన్యూస్ ):కార్యక్రమంలో 66 డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ హాసన్పర్తే సిఐ వి చేరాలు ఏఈఓ కల్పన సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి మున్సిపల్ ఆర్ ఐ సునీల్ వార్డ్ ఆఫీసర్ రాజు 66 అధ్యక్షులు కనపర్తి కిరణ్ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీసం సురేందర్ రెడ్డి ఇందిరమ్మ కమిటీ సభ్యులు వింజమూరు వెంకటేశ్వర్లు జన్ను రవీందర్ తాల్ల మధు పల్లెకు అనుష బ స్కురి వాణి మాజీ సర్పంచ్ పుల్ల రవీందర్ మాజీ చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి శీలం రమేష్ కనపర్తి రాజు గొర్రె కిరణ్ వేల్పుల సంపత్ పెద్దమ్మ నరసింహారావు బిగులా సురేష్ తదితరులు పాల్గొన్నారు

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి...!

### స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి...

చిట్యాల ,21 జనవరి (క్రాంతిన్యూస్ ):జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో జరిగిన గ్రామసభలోస్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 26వ తేదీ నుండి అమలు చేయబోతున్న నాలుగు సంక్షేమ పథకాలైన రైతు భరోసా ఇందిరమ్మ ఇల్లు ఆహార భద్రత కార్డులు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అర్హులైన అసలైన లబ్ధిదారులకే అందేలా చూస్తామని అన్నారు అలాగే వివిధ పథకాలకుఅప్లై చేసుకున్న లబ్ధిదారులు వారి యొక్క పేరు మీద పథకాలు రాకుండా ఉన్నకానీ నిరుత్సాహపడకుండా పథకాల ఎంపికలో ఈ రోజే కాకుండా ప్రతిరోజు ఎంపీడీవో ఆఫీసులో అప్లై చేసుకోవచ్చు అని నిరాశ నిర్స్పృహలకు లోను కాకుండా దరఖాస్తులు చేసుకోవాలని ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు ఈ కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ రవికుమార్ ఐసి డి ఎస్ సూపర్వైజర్ జయప్రద అంగనివాడికార్యకర్తలు వివో ఏలు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## మహాకుంభమేళా వెళ్లే వారి కోసం

# ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ..

### 7 రోజుల టూర్.. పూర్తి వివరాలివే!




ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సమ్మేళనం ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా మొదలైపోయింది. 144 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ మహాకుంభమేళా జనవరి 13న మొదలైంది. ఫిబ్రవరి 26తో ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా ముగియనుంది. మహాకుంభమేళాలో పాల్గొనేందుకు, పుణ్యస్నానాలు ఆచరించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు లక్షల మంది తరలివెళ్తున్నారు. అలాగే ఇతర దేశాల నుంచి కూడా భక్తులు వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తెలుగు రాష్ట్రాల నుంచి కుంభమేళాకు వెళ్లేవారికి ఏపీఎస్ఆర్టీసీ సూపర్ న్యూస్ చెప్పింది. మహాకుంభమేళాకు వెళ్లే వారి కోసం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది.

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ఏపీఎస్ఆర్టీసీ డిపో అధికారులు మహాకుంభమేళాకు వెళ్లే వారి కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని కొవ్వూరు డిపో అధికారులు ఓ ప్రకటనలో తెలియజేశారు. కొవ్వూరు డిపో నుంచి బయల్దేరనున్న బస్సు.. వివిధ పుణ్యక్షేత్రాల మీదుగా ప్రయాగ్‌రాజ్ చేరుకుంటుంది. ఆ తర్వాత తిరిగి కొవ్వూరు వస్తుందని.. మొత్తం ఏడు రోజుల పాటు యాత్ర జరుగుతుందని అధికారులు చెప్పారు.

ఫిబ్రవరి ఒకటో తేదీ మధ్యాహ్నం 2 గంటలకు కొవ్వూరు డిపో నుంచి బస్సు బయల్దేరుతుందని డిపో అధికారులు తెలిపారు. భువనేశ్వర్, పూరి, కోణార్క్, ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు చేరుకుంటుంది. ఆ తర్వాత వారణాసి, గయ, బుద్ధ గయ, అరసవల్లి, శ్రీకూర్మం మీదుగా కొవ్వూరు చేరుకుంటుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. మొత్తం 7 రోజుల పాటు ఈ యాత్ర జరుగుతుందని వివరించారు.

ప్యాకేజీలో భాగంగా ప్రయాగ్‌రాజ్, కాశీలలో ఒక రోజు బస ఉంటుందని.. అలాగే ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రిపూట అల్పాహారం అందిస్తామని తెలిపారు. యాత్ర సమయంలో ప్రయాణికులకు అనుకూలంగా ఉండేదుకు యాప్ కూడా రూపొందించారు. ఈ యాప్ సాయంతో ప్రయాణికులు ఎక్కడ ఉన్నా కూడా బస్సు వద్దకు చేరుకోవచ్చు. ఈ ప్యాకేజీలో భాగంగా ఒక్కరికి రూ.10 వేలు చొప్పున టికెట్ రేటు నిర్ణయించారు. ఇక ప్రయాణికుల కోసం సూపర్ లగ్జరీ వీడియో కోచ్ బస్సును ఏర్పాటుచేశారు. ఆసక్తి ఉన్న వారు తమను సంప్రందించి పేర్లు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఏపీలో లిక్కర్ షాపులకు మళ్లీ దరఖాస్తులు..

## వారికి మాత్రమే.. ఏ జిల్లాలో ఎన్నంటే?




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. 335 లిక్కర్ షాపులకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసింది. ఏపీ ఎన్నికల సమయంలో కల్లు, గీత కులవృత్తుల వారికి పది శాతం మద్యం షాపులు కేటాయిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇక ఇచ్చిన హామీ మేరకు కల్లు, గీత కులాలకు 335 మద్యం షాపులు కేటాయిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కల్లు, గీత కులవృత్తుల వారికి జిల్లాల వారీగా 335 మద్యం షాపులు కేటాయిస్తూ ఏపీ అబ్కారీ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. గౌడ, ఈడిగ, శెట్టిబలిజ, గౌడ, యాత, గౌండ్ల, శ్రీశయన, శెగిడి, గామల్ల కులాల వారికి ఈ 335 మద్యం షాపులు కేటాయించారు.


ఏపీలో టీడీపీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన మద్యం విధానం అమల్లోకి తెచ్చింది. కొత్త ఎక్సైజ్ పాలసీ ప్రకారం ప్రైవేట్ వ్యక్తులకు మద్యం దుకాణాలు అప్పగించారు. 3,396 షాపులకు ప్రభుత్వం లైసెన్సులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు లిక్కర్ షాపుల్లో పది శాతం అంటే 340 దుకాణాలను కల్లు, గీత కార్మికులకు కేటాయించాలని నిర్ణయించారు. అయితే ప్రకాశం జిల్లా పర్యటనలో ఓ కుటుంబానికి మద్యం దుకాణం కేటాయిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ఒక షాపును సదరు కుటుంబానికి కేటాయించనున్నారు. అలాగే ఉత్తరాంధ్రలో నాలుగు లిక్కర్ షాపులను సొండి కులాల వారికి కేటాయించాలని నిర్ణయించారు.

ఆ ఐదు లిక్కర్ షాపులు పోనూ మిగిలిన 335 మద్యం దుకాణాలను కల్లు, గీత కార్మికులకు కేటాయిస్తూ ఏపీ అబ్కారీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక తిరుపతి జిల్లాకు అత్యధికంగా 23 షాపులు దక్కాయి. ఆ తర్వాత శ్రీకాకుళం, నెల్లూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి జిల్లాలలో 18 మద్యం షాపుల చొప్పున కల్లు, గీత కులాల వారికి కేటాయించారు. కాకినాడ, విజయనగరం జిల్లాలో 16 మద్యం దుకాణాలు చొప్పున, అనకాపల్లి 15, ఏలూరు, విశాఖపట్నం, కడప, అనంతపురం జిల్లాలలో 14 షాపులు, తూర్పుగోదావరి, పల్నాడు, గుంటూరు, కోనసీమ జిల్లాలలో 13 లిక్కర్ షాపుల చొప్పున కల్లు, గీత కార్మికులకు కేటాయించారు. బాపట్ల, కృష్ణా జిల్లాలకు 12, అన్నమయ్య,ఎన్టీఆర్, నంద్యాల జిల్లాలకు 11, చిత్తూరు, కర్నూలు జిల్లాలలో పదేసి షాపుల చొప్పున గీత కార్మికులకు కేటాయించారు. శ్రీసత్యసాయి- 9, పార్వతీపురం మన్యం-4, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఒక మద్యం షాపును గీత కార్మికులకు కుటుంబాలకు కేటాయించారు..

మరోవైపు నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకునే వీలుంది. కానీ ఒక్క దుకాణం మాత్రమే కేటాయిస్తారు. లాటరీలో ఒకటి కంటే ఎక్కువ వచ్చినా కూడా వాటిని రద్దు చేస్తారు. ఇక లిక్కర్ షాపులకు దరఖాస్తు చేసుకునేందుకు రూ. 2 లక్షలు ఫీజుగా నిర్ణయించారు. ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించరు. అలాగే లిక్కర్ షాపులకు దరఖాస్తు చేసే సమయంలో దరఖాస్తుదారులు, అప్లికేషన్‌తో పాటుగా కుల ధ్రువీకరణ పత్రాలు జత చేయడం తప్పనిసరని అధికారులు స్పష్టం చేశారు. ఇక రెండేళ్ల కాలానికి లైసెన్సులు జారీ చేస్తారు.

# జిల్లా కలెక్టర్లకే షాకులిచ్చారు..

# ఇలాంటోళ్లతో బీ కేర్ ఫుల్!




దారి కాచి దోపిడీలకు కాలం చెల్లింది. అర్ధరాత్రి ఇళ్లల్లోకి చొరబడి చోరీలు చేయడం పాతదైపోయింది. కాలంతో పాటే పరుగులు తీస్తూ మనిషి మారినట్టు.. నేరగాళ్లు కూడా రూటు మార్చారు. 4జీ నుంచి 5జీ.. అటు నుంచి 6జీ ఇలా టెక్నాలజీ మారినట్లు.. ఆండ్రాయిడ్ అప్‌డేట్ అయినట్లు దొంగలు కూడా చోరీలలో తమ టాలెంట్ చూపిస్తున్నారు. ఇప్పుడెవరూ ఇళ్లల్లోకి దూరి చోరీలు చేయడం లేదు. దర్జాగా కాలుమీద కాలువేసుకుని.. ఇంట్లో నుంచే కాజేస్తున్నారు. జస్ట్ క్లిక్ చేస్తే చాలు.. ఖాతాలల్లో నగదు మాయం.. అదే సైబర్ మోసం..

అయితే ఇప్పుడు సైబర్ నేరగాళ్లు మరీ బరి తెగించారు. వీఐపీలు, ప్రముఖుల పేర్లతో నకిలీ ఖాతాలు సృష్టించి.. డబ్బులు దోచేస్తున్నారు. ఇలాంటి వ్యవహారమే ఏపీలో బయటపడింది. ఒకటి కాదు రెండు చోట్ల.. అది కూడా మామూలు వ్యక్తులు కాదు, ఐఏఎస్‌లకే ఇలాంటి పరిస్థితి ఎదురైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్. దినేష్ కుమార్ పేరుతో సైబర్ నేరగాళ్లు ఫేక్ ఖాతా సృష్టించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కు చెందిన మోసగాళ్లు కలెక్టర్ పేరుతో ఫేక్ ఖాతాను సృష్టించారు. ఈ విషయాన్ని అల్లూరు సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు.

%పలు నంబర్లతో సృష్టించిన ఖాతాలు మోసపూరితమైనవని ప్రజలకు తెలియజేశారు. ఆ నంబర్ల ద్వారా డబ్బులు అడుగుతున్నారని.. దానికి ఎలాంటి డబ్బులు పంపవద్దని ప్రజలకు సూచించారు. ఆ నంబర్ నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజులకు స్పందించవద్దని కోరారు. అలాంటి విషయాల్లో అప్రమత్తంగా ఉంటూ సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని దినేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. దీనిపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

బాపట్ల జిల్లా కలెక్టర్ విషయంలోనూ ఇలాంటి తరహా ఘటన జరిగింది. బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి మొబైల్‌ను హ్యాకర్లు హ్యాక్ చేశారు. ఈ విషయాన్ని గమనించిన కలెక్టర్ మంగళవారం ప్రజలను, జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ ఫోన్ నెంబర్లతో హ్యాకర్లు జిల్లా కలెక్టర్ గుర్తింపును దుర్వినియోగం చేస్తున్నారని ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వ అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోరారు. కలెక్టర్ ఫోటో, గుర్తింపు చిహ్నాలతో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఎలాంటి సందేశాలు వచ్చినా స్పందించ వద్దని బాపట్ల జిల్లా కలెక్టర్ కోరారు. ఇలాంటి విషయాల్లో ఎలాంటి సమాచారం వచ్చిన తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# ఏపీకి మరో ప్రతిష్టాత్మక సంస్థ..

## అక్కడే ఏర్పాటు.. దావోస్‌లో చంద్రబాబు ప్రకటన

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మరో ప్రతిష్టాత్మక సంస్థ కొలువు దీరనుంది. ఈ విషయాన్ని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు స్విట్జర్లాండ్ వెళ్లారు చంద్రబాబు నాయుడు. దావోస్ పర్యటనలో అమరావతిలో సీఐఐ కేంద్రం ఏర్పాటుపై నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. టాటా సంస్థతో కలిసి రాజధాని అమరావతిలో సీఐఐ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన లక్ష్యంగా సీఐఐ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చంద్రబాబు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్?లో పోస్ట్ చేశారు.



టాటా కంపెనీల భాగస్వామ్యంతో అమరావతిలో సీఐఐ సెంటర్ ఫర్ గ్లోబల్ లీడర్‌షిప్ ఆన్ కాంపిటీటీవ్‌నెస్ ఏర్పాటు చేయనున్నట్లు చంద్రబాబు ట్వీట్‌లో వెల్లడించారు. ఈ గ్లోబల్ లీడర్‌షిప్ ఆన్ కాంపిటీటివ్ నెస్ ద్వారా అంతర్జాతీయ, భారతీయ సంస్థల సహకారంతో ట్రాన్స్‌ఫర్మేటివ్ ఎడ్యుకేషన్, అధునాతన నైపుణ్యాలు, కెపాసిటీ బిల్డింగ్ అందిస్తామన్నారు. ట్రైనింగ్, అడ్వైజరీ సర్వీసుల ద్వారా ఇండస్ట్రియల్ కాంపిటీటివ్‌నెస్ మీద దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. సీఐఐ సెంటర్ ద్వారా పెట్టుబడులను ఆకర్షించటంతో పాటుగా ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుందని.. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. అలాగే వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి తోడ్పాటును అందిస్తుందటూ చంద్రబాబు ట్వీట్ చేశారు.

మరోవైపు సీఐఐ నిర్వహించిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రణాళికలను చంద్రబాబు నాయుడు వివరించారు. పునరుత్పాదక ఇంధన రంగంలో గ్లోబల్ హబ్‌గా ఏపీని తీర్చిదిద్దేందుకు తీసుకోబోతున్న ప్రణాళికలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024-29 అనేది పునరుత్పాదక శక్తి, గ్రీన్ హైడ్రోజన్ అంశాలను ఏకీకృతం చేయడంతో పాటుగా పునరుత్పాదక ఇంధన రంగానికి అవసరమైన నైపుణ్యాలను అందించే ఒక సమగ్ర ఫ్రేమ్‌వర్క్‌గా చంద్రబాబు అభివర్ణించారు. 2030 నాటికి దేశం నిర్దేశించుకున్న లక్ష్యంలో 30 శాతం అంటే.. 1.5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం ఉన్నట్లు వివరించారు. అలాగే గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులు పెట్టే ప్రపంచస్థాయి కంపెనీలకు ఏపీని గమ్యస్థానంగా మార్చనున్నట్లు చంద్రబాబు వివరించారు.

# నారా లోకేష్‌కు డిప్యూటీ సీఎం డిమాండ్లు.. నేతలకు జనసేన హైకమాండ్ కీలక ఆదేశాలు!

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం డిప్యూటీ సీఎం, సీఎం పదవులపై పెద్దఎత్తున చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. మంత్రి నారా లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలంటూ టీడీపీ నేతల నుంచి మొదట డిమాండ్లు వచ్చాయి. దీంతో పవన్ కళ్యాణ్‌ను సీఎం చేయాలంటూ జనసేన శ్రేణులు కూడా డిమాండ్లు మొదలెట్టాయి. ఈ వ్యవహారంపై సోషల్ మీడియాలో పెద్ద చర్చ జరుగుతున్న సమయంలో.. టీడీపీ అధిష్టానం వీటికి ఫుల్ స్టాప్ పెట్టే ప్రయత్నం చేసింది.

నారా లోకేష్‌కు డిప్యూటీ సీఎం పదవి గురించి ఎవరూ మాట్లాడవద్దని స్పష్టం చేసింది. వ్యక్తిగత అభిప్రాయాలను పార్టీపై రుద్దవద్దని.. కూటమి ప్రభుత్వంలో తీసుకునే ఎలాంటి నిర్ణయమైనా పార్టీల అధినేతలు అందరూ కలిసి చర్చించుకున్న తర్వాతే తీసుకుంటారని స్పష్టం చేసింది. మొత్తంగా నారా లోకేష్‌కు డిప్యూటీ సీఎం డిమాండ్లపై అత్యుత్సాహం వద్దని టీడీపీ నేతలకు అధిష్టానం ఓ రకంగా గట్టిగానే చెప్పింది. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి నేతలకు ఈ మేరకు ఆదేశాలు వెళ్లినట్లు సమాచారం.

ఇదిలా ఉన్న సమయంలో జనసేన పార్టీ కూడా డిప్యూటీ సీఎం అంశంపై స్పందించింది. డిప్యూటీ సీఎం అంశంపై ఎవరూ స్పందించవద్దంటూ మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లాయి. మీడియాతో పాటుగా సోషల్ మీడియాలోనూ డిప్యూటీ సీఎం అంశంపై మాట్లాడవద్దంటూ జనసైనికులకు అధిష్టానం స్పష్టం చేసింది. దీంతో ఈ వ్యవహారానికి ఇకనైనా ఫుల్ స్టాప్ పడుతుందా అనేది ఆసక్తికరంగా మారింది.

మరోవైపు నారా లోకేష్‌కు డిప్యూటీ సీఎం ఇవ్వాలనే డిమాండ్లపై టీడీపీ అధిష్టానం ఆదేశాల తర్వాత కూడా మంత్రి టీజీ భరత్ హాట్ కామెంట్స్ చేసిన సంగతి తెలిసిందే. దావోస్ పర్యటనకు వెళ్లిన టీజీ భరత్‌కు.. పార్టీ అధిష్టానం నిర్ణయంపై సమాచారం ఉందో లేదో తెలియదు కానీ.. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఉన్న వేదికపై నుంచే కీలక వ్యాఖ్యలు చేశారు. ఎవరికి ఇష్టం ఉన్నా, లేకున్నా నారా లోకేష్ కాబోయే ముఖ్యమంత్రి అంటూ టీజీ భరత్ కీలక వ్యాఖ్యలు చేశారు. అయితే దీనిపై చంద్రబాబు, టీజీ భరత్‌ను మందలించినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే జనసేన కూడా తమ నేతలు, కార్యకర్తలు ఎవరూ డిప్యూటీ సీఎం అంశంపై మాట్లాడవద్దని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.



# గరియాబంద్‌లో భారీ ఎన్‌కౌంటర్.. 20 మంది మావోయిస్టులు మృతి

**మొదటి పేజీ తరువాయి**

ఛత్తీస్‌గఢ్ గరియాబంద్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ ఇప్పటి వరకు 20 మంది మావోయిస్టులు మృతి చెందారు. ప్రస్తుతం సంఘటనా స్థలంలో ఇంకా ఎన్‌కౌంటర్ కొనసాగుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఎన్‌కౌంటర్‌లో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. జిల్లాలోని కుల్హాడి ఘాట్‌లోని అటవీ ప్రాంతాన్ని వెయ్యి మందికిపైగా భద్రతా బలగాలు అన్ని వైపులా చుట్టుముట్టాయి. అటవీ ప్రాంతంలో 60 మందికిపైగా మావోయిస్టులు అక్కడ దాక్కున్నట్లు సమాచారం మేరకు బలగాలు ఆపరేషన్ నిర్వహించాయి. ఎన్‌కౌంటర్‌లో ఓ జవాన్‌ను గాయపడ్డాడు. గాయపడ్డ జవాన్‌ను విమానంలో రాయ్‌పూర్‌కు తరలిస్తున్నారు. ఇప్పటి వరకు 16 మంది నక్సల్స్ మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు రాయ్‌పూర్ జోన్ ఐడీ అమ్రేష్ మిశ్రా తెలిపారు.

సంఘటనా స్థలంలో ఏకే 47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ తదితర ఆటోమేటిక్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ప్రస్తుతం సెర్చ్ ఆపరేషన్ జరుగుతుందన్నారు. మెయిన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుల్హాడి ఘాట్ ప్రాంతంలో ఆదివారం రాత్రి నుంచి భద్రతా దళాలు, నక్సలైట్ల మధ్య ఎన్‌కౌంటర్ జరుగుతోందని.. ఇందులో పలువురు ప్రాణాలు కోల్పోయినట్లుగా సమాచారం అందిందని ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ సోషల్ మీడియా వేదికగా తెలిపారు. మార్చి 2026 నాటికి దేశం, రాష్ట్రంలో నక్సలైట్స్‌ను అంతం చేయాలనే ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంకల్పం మేరకు భద్రతా బలగాలు ఈ విషయంలో నిరంతరం విజయం సాధిస్తూ లక్ష్యం వైపు వేగంగా కదులుతున్నాయన్నారు. ఈ సందర్భంగా బలగాలకు ప్రశంసించిన ఆయన.. ధైర్య సాహసాలకు వందనం చేస్తున్నానన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కారులో 2026 నాటికి ఛత్తీస్‌గఢ్ నక్సలిజం నుంచి విముక్తి పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఎన్‌కౌంటర్‌లో తలపై కోటి రివార్డు ఉన్న జైరామ్ అలియాస్ చలపతి ప్రాణాలు కోల్పోయారు. ఆయన కేంద్ర కమిటీ సభ్యుడిగా పని చేస్తున్నట్లు సమాచారం. అలాగే, సీనియర్ మావోయిస్టు సైతం మృతి చెందినట్లు తెలుస్తున్నది. ఇక గరియాబంద్ ఆపరేషన్‌లో గ్రూప్ ఈ30, కోబ్రా 207, సీఆర్పీఎఫ్ 65, 211 బెటాలియన్, ఎస్ఓసీ నువాపాడా సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశా దళాలు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించాయి. ఛత్తీస్‌గఢ్ నుంచి మూడు, ఛత్తీస్‌గఢ్ పోలీసు విభాగానికి చెందిన రెండు, సీఆర్పీఎఫ్‌కు చెందిన ఐదు బృందాలు పాల్గొన్నాయి.

## యలాల్ మండలం అన్నసాగర్ లో,ఈనెల 25న

**పాస్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాలిబాల్ టోర్నమెంట్.**

వికారాబాద్ ,21 జనవరి (క్రాంతిన్యూస్ ): ఓపెన్ టు ఆల్ వాలీబాల్ టోర్నమెంట్,వికారాబాద్ జిల్లా యాలాల మండలం అన్నసాగర్ గ్రామంలో ఈనెల 25తేదీన నిర్వహించబడును. ఈ టోర్నమెంట్ లో పాల్గొనే వారు తేదీ 24 వరకు తమ టీమ్స్ ని 300 ఎంట్రీ పీస్ తో నమోదు చేసుకోగలరు. ఈ టోర్నీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 5000, రెండవ బహుమతి3000, మూడవ బహుమతి 1000 రూపాయలు ప్రైజ్ మనీ తో పాటు షీల్డ్ కూడా ఇవ్వబడును. టీములు సంప్రదించవలసిన నెంబర్ 8347598340 మధ్యాహ్న భోజనం కలదు, మ్యాచ్ జరిగే సమయంలో ఎంపీఆర్ నిర్ణయమే తుది నిర్ణయం అవుతుంది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలందరూ పాల్గొనడం జరుగుతుంది.

# నిజమైన అర్హులకు సంక్షేమ ఫలాలను అందజేస్తాం.

**ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

ములుగు జిల్లా ప్రతినిధి ,21 జనవరి (క్రాంతిన్యూస్ ):రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్ అన్నారు. మంగళవారం ములుగు మండలంలోని జీవింతరావుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడి కేంద్రం లో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు

రవి చందర్ తొ కలసి జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈ నెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు.




అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ ఇప్పటికే పలు పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం మరో నాలుగు పథకాలను ఈ నెల 26 నుండి అర్హులకు అందించడానికి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకాల కింద అర్హులను గుర్తించేందుకు వీలుగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించడం జరిగిందని కలెక్టర్ గుర్తు చేశారు. గ్రామ సభలు నిర్వహిస్తున్న సంబంధిత అధికారులు నిజమైన అర్హులను గుర్తించడానికి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. గ్రామసభల అనంతరం ఎంపిక చేసిన అర్హులపై ఎలాంటి అభ్యంతరాలను అధికారులకు తెలియజేయాలని, పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరమే సంబంధిత పథకాల అర్హులను ప్రకటించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

సాగు భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రెండు విడతల్లో సాలీనా 12 వేల రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. ఎలాంటి సాగు భూమి లేకుండా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు పని చేసిన కుటుంబాలను అర్హులుగా గుర్తించామన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్ర పరిశీలన జరిపి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులను నిర్ధారించామని తెలిపారు. ఆయా పథకాల కింద ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకోని వారితో పాటు, అర్హత కలిగి లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారి నుండి కూడా అర్జీలు స్వీకరించారు.రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల కోసం అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. వాటిని సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు, అనవసర ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని అన్నారు. గ్రామ సభలలో దరఖాస్తులు అందజేయవచ్చని సూచించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా పరిశీలించి, అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని కలెక్టర్ భరోసా కల్పించారు.

సంబంధిత అధికారులు నిర్వహిస్తున్న గ్రామ సభలకు ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి కొమురయ్య, ఎంపీ ఓ రహీం పంచాయితి కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయి

**సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ**

**ప్రభుత్వ పథకాలు ఇప్పిస్తామని చెప్పే దళారులను నమ్మకండి**

**ఇటుక బట్టీలు బ్రిక్స్ కంపెనీలు ఇతర కమర్షియల్ భూములకు, రైతు భరోసా వర్తించదు**

**వలస ఆదివాసీలకు విద్యా వైద్యం ఉపాధి అవకాశాలు కల్పిస్తాం**

**మద్దుకూరు గ్రామసభలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో ,21 జనవరి (క్రాంతిన్యూస్ ):సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. మంగళవారం చంద్రుగొండ మండలం మద్దుకూరు గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామ సభలలో కలెక్టర్ పాల్గొని ప్రజలకు,



అధికారులకు పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ పథకాల కింద అర్హులను గుర్తించేందుకు వీలుగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించడం జరిగిందని గుర్తు చేశారు. ముఖ్యంగా సాగుకు యోగ్యమైన భూములను పక్కాగా నిర్ధారించామని అన్నారు. పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకు ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఎకరానికి 12 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తుందని తెలిపారు. ఇటుక బట్టీలు బ్రిక్స్ తయారీ కంపెనీలు, ఇతర కమర్షియల్ భూములకు రైతు భరోసా వర్తించదని ఆయన తెలిపారు. ఎవరైతే తిరిగి మళ్లీ ఆ భూముల్లో వ్యవసాయం చేస్తారో అప్పుడు వారికి కూడా రైతు భరోసా కల్పిస్తామన్నారు. అదే విధంగా సాగు భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రెండు విడతల్లో 12 వేల రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. ఎలాంటి సాగు భూమి లేకుండా కనీసం 20 రోజులు ఉపాధి హామీ పథకంలో పని చేసిన కుటుంబాలను అర్హులుగా గుర్తించామన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్ర పరిశీలన జరిపి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులను నిర్ధారించామని తెలిపారు. ఈ మేరకు వివిధ పథకాల ద్వారా అర్హులుగా గుర్తించబడిన వారి వివరాలను గ్రామ సభలో అందరి సమక్షంలో చదివి వినిపించారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల కోసం అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.ఆయా పథకాల కింద ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకోని వారితో పాటు, అర్హత కలిగి లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారి నుండి కూడా అర్జీలు స్వీకరించారు. వాటిని సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు, అనవసర ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని అన్నారు. గ్రామ సభలలో దరఖాస్తులు అందజేయవచ్చని, వీలుపడని వారు ఈ నెల 26 తరువాత ఎప్పుడైనా మండల కార్యాలయాలలోని ప్రజా పాలన సేవా కేంద్రాలకు వెళ్లి సంబంధిత పత్రాలను జాతచేస్తూ దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా పరిశీలించి అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని కలెక్టర్ భరోసా కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇప్పిస్తామని వచ్చే దళారులను నమ్మి మోసపోవద్దని కలెక్టర్ అన్నారు. వలస ఆదివాసీల అభివృద్ధి కోసం విద్యా వైద్యం ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. ఆదివాసీలు పోడు పేరుతో అడవులు నరక వద్దని, నరికిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, తాసిల్దార్

బి.సంధ్యారాణి, ఎంపీడీవో బి. అశోక్, సొసైటీ వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# గుర్తింపు లేని మల్టీ లెవెల్ మార్కెటింగ్ కంపెనీల మోసాల బారిన పడకండి

**అప్రమత్తతే ఆయుధం.. సైబర్ నేరాల బారినపడి మోసపోకుండా జిల్లా ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి - ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్**

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో ,21 జనవరి (క్రాంతిన్యూస్ ):మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలపై అలర్ట్ గా ఉండాలని




జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ ఉత్పత్తులు, హెర్బల్,హెల్త్ కేర్, ఇతర గృహోపకరణాల మార్కెటింగ్ పేరుతో కొత్త తరహా మోసాలు జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ మంగళవారం రోజున ఒక ప్రకటనను విడుదల చేశారు.తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు ఇస్తామని మళ్లీ మల్టీ లెవెల్ మార్కెటింగ్ (పిరమిడ్ మోసాలు) మళ్ళీ ప్రారంభమయ్యాయని అన్నారు.గొలుసుకట్టుగా అమాయకులను వల వేసి మోసం చేస్తున్నారని హెచ్చరిస్తున్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఈ విధమైన మోసాలకు కొంతమంది వ్యక్తులు పాల్పడుతున్నారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ తరహా మోసాల బారిన పడకుండా ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తతతో వ్యవహరించాలని కోరారు.

విలాసవంతమైన వస్తువులిస్తామని,ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తామని,విదేశీ యాత్రలకు పంపుతామని, రకరకాల మాయమాటలతో ఆఫర్లు పెట్టి,ప్రజల నుండి మొదటగా సభ్యత్వాలను స్వీకరించి, వారితో మరికొంతమందిని సభ్యులుగా చేర్పించే ప్రయత్నం చేస్తూ ఎంత ఎక్కువ మందిని సభ్యులుగా చేర్పిస్తే అంత అధిక మొత్తంలో డబ్బులు తిరిగొస్తాయని నమ్మించి ప్రజల్ని మభ్యపెట్టే కొత్త కొత్త టెక్నిక్ లతో సైబర్ నేరగాళ్లు మార్కెట్లోకి వస్తున్నారు. ఇలాంటి స్కీం లలో తొలుత చేరిన తక్కువ మందికి లాభాలు చూపించి, మిగిలిన అందరి సొమ్ము కొల్లగొడతారని తెలిపారు.ఇలాంటి నూతన స్కీం ల పట్ల, నేరగాళ్ల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది.మనకు ఎటువంటి సంబంధం లేని వాళ్ళు మనకు ఏ విధమైన ఆర్థిక ప్రయోజనం ఊరికే చెయ్యరనే విషయాన్ని గ్రహించాలని తెలిపారు.మనల్ని నమ్మించి,మభ్యపెట్టి, వంచించి మన దగ్గరి,మన ద్వారా మరికొందరి కష్టార్జితాన్ని కొల్లగొట్టడమే మోసగాళ్ల పని అని తెలిపారు. కాబట్టి ఇలాంటి నేరాల పట్ల మొబైల్ ఫోన్లను చూసే మనకు ఫేస్ బుక్ ,వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్స్టాగ్రామ్, యూట్యూబ్, ఈ-మెయిల్, ఫోన్ కాల్ ల ద్వారా మీ దృష్టిని ఆకర్షించే ఇటువంటి కుట్రలకు ఎట్టిపరిస్థితుల్లో లొంగవద్దని తెలుప్పారు.తొందరపడి బాధలను,నష్టాలను కొని తెచ్చుకోవద్దన్నారు.ఒకవేళ మీరు అన్ని జాగ్రత్తలను తీసుకున్నా కూడా మోసపోయిన పక్షంలో ఒక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా 1930 టోల్ ఫ్రీ నంబర్ కి గానీ, %ఋఋ.ఎఎవతీఎతీఱఎవ.స్త్రశీజ.ఱఅ% ద్వారా కానీ లేదా మీ సమీప పోలీస్ స్టేషన్ లో నైనా వెంటనే పూర్తి వివరాలతో ఫిర్యాదు చెయ్యాలని సూచించారు.సైబర్ మోసాల బారిన పడిన బాధితులు ఎంత త్వరగా ఫిర్యాదు చేయగలిగితే అంత త్వరగా వారు కోల్పోయిన నగదును తిరిగి పొందవచ్చని తెలిపారు.

# ఆరోగ్య క్రాంతి



## కిడ్నీలో రాళ్లు ఉంటే క్యాన్సర్ వస్తుందా

హెల్త్ న్యూస్ ,21 జనవరి (క్రాంతిన్యూస్ ):కిడ్నీలో రాళ్ల సమస్య చాలామందిని ఎఫెక్ట్ చేస్తుంది. దీని వల్ల కడుపు నొప్పి, వికారం, మూత్ర విసర్జనలో ఇబ్బంది ఏర్పడుతుంది. దీంతో కొన్నిసార్లు మూత్రంలో రక్తం కూడా వస్తుంది. ఇది ప్రమాదంగా మారుతుంది. కిడ్నీలో రాళ్ల సమస్య ప్రమాదం కానప్పటికీ, దానికి సరిగా ట్రీట్‌మెంట్ చేయకపోతే కొన్ని రకాల క్యాన్సర్ అభివృద్ధికి కారణమవుతాయి. రెగ్యులర్‌గా కిడ్నీలో రాళ్లు వస్తే అది మూత్రనాళాన్ని చికాకుపెడతాయి. దెబ్బతీస్తాయి. ఈ చికాకు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి, యూరాలజిస్ట్‌ని కచ్చితంగా కలవాలి. లేదంటే సమస్య పెరిగే అవకాశం ఉంది. నిపుణులని కలిస్తేనే వారు సరిగా పరిశీలించి మన సమస్యకి పరిష్కారాన్ని సూచిస్తారు



### క్యాన్సర్ గురించి ఎప్పుడు జాగ్రత్త పడాలి

రాళ్ళ సమస్య ఉండి కొన్ని లక్షణాలు ఉంటే అప్పుడు అనుమానించాలి. అవేంటంటే..
బరువు తగ్గడంమూత్రంలో రక్తంరెగ్యులర్‌గా రాళ్ళు రావడం

### సంబంధిత సమస్యలు

ఎక్కువ రక్తపోటు
ఊబకాయం
దీర్ఘకాలిక మూత్రపిండ సమస్యలు
కుటుంబంలో ఎవరికైనా మూత్రపిండ క్యాన్సర్ ఉండడం
రెగ్యులర్‌గా రాళ్ళు
ఇన్ఫెక్షన్స్ రావడం

### లేజర్ లిథోట్రిప్సీ :

సాధారణంగా రాళ్లకి ట్రీట్‌మెంట్‌గా దీనిని చేస్తారు. దీని వల్ల త్వరగా కోలుకుంటారు. మచ్చలు లేకుండా ఉంటాయి. మనకి ఈ ట్రీట్‌మెంట్ అవసరమైతే డాక్టర్ పరీక్ష చేసి ట్రీట్‌మెంట్ సజెస్ట్ చేస్తారు.

### రాళ్ల సమస్య తగ్గేందుకు ఏం చేయాలి?

రాళ్లని మొదట్లోనే గుర్తించాలి.
హైడ్రేట్‌గా ఉండాలి. నీరు ఎక్కువగా తీసుకోవాలి.
రోజుకి కనీసం 8 నుంచి 10 గ్లాసుల నీరు తాగాలి.
ఉప్పు, తీపి డ్రింక్స్, ఆక్సలేట్ ఎక్కువగా ఉండే ఆహారం తక్కువగా తీసుకోవాలి. నారింజ, నిమ్మకాయలు, ఉలవలు, కాకరకాయ, అరటిపండ్లు తీసుకోవాలి.

### ఏమేం జాగ్రత్తలు తీసుకోవాలి?

షుగర్, దీర్ఘకాలిక మూత్రపిండ సమస్యలు, అధికబరువు, అధిక రక్తపోటుని తగ్గించడం వల్ల రాళ్లు, క్యాన్సర్ వంటి ప్రమాదాలని తగ్గించుకోవచ్చు. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడితే చాలా ఇబ్బందిగా ఉంటుంది. మీకు ఇలాంటి లక్షణాలు ఉంటే త్వరగా యూరాలజిస్ట్‌ని సంప్రదించాలి. సమస్యని త్వరగా గుర్తించి సరైన ట్రీట్‌మెంట్ తీసుకుంటే సమస్యని తగ్గించుకోవచ్చు. క్యాన్సర్ సహా ఇతర వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. కాబట్టి, మూత్రపిండాల్లో రాళ్ల క్యాన్సర్‌కి కారణం కానప్పటికీ, వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. ప్రమాదాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. వెంటనే డాక్టర్‌ని కలవండి

## మద్యం సేవించేటప్పుడు వీటిని తినకండి

హెల్త్ న్యూస్ ,21 జనవరి (క్రాంతిన్యూస్ ):సాధారణంగా చాలా మంది మద్యం సేవించేటప్పుడు ఏవో ఒక స్నాక్స్ తింటుంటారు. ఆల్కహాల్ వల్ల లివర్‌కు డ్యామేజ్ అవ్వొద్దని చెప్పి ఇలా చేస్తుంటారు. కొందరు ఆరోగ్యకరమైన స్నాక్స్ తింటారు. అయితే మద్యం సేవించేటప్పుడు ఏది పడితే అది తినకూడదని వైద్యులు చెబుతున్నారు. అలా తినడం వల్ల లివర్‌పై ప్రభావం పడడంతోపాటు శరీరంపై కూడా దుష్ప్రభావం పడుతుందని వారు చెబుతున్నారు. ఆల్కహాల్‌ను సేవించినప్పుడు కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల మన శరీరంపై నెగెటివ్ ప్రభావం పడుతుందని, దీంతో వ్యాధులు వచ్చే అవకాశాలు పెరుగుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక మద్యం సేవించేటప్పుడు ఏయే ఆహారాలను తీసుకోకూడదో ఇప్పుడు తెలుసుకుందాం.



### కారం ఉండే ఆహారాలు..

చాలా మంది మద్యం సేవించేటప్పుడు కారంగా ఉండే ఆహారాలను తింటుంటారు. కానీ వాస్తవానికి ఆల్కహాల్ అనేది స్వతహాగా ఆసిడిటీని కలిగిస్తుంది. ఈ క్రమంలో మద్యం సేవించేటప్పుడు కారం ఉండే ఆహారాలను తింటే అసిడిటీ ఎక్కువవుతుంది. దీని వల్ల కడుపులో తీవ్రమైన మంట వస్తుంది. కాబట్టి మద్యం సేవించేటప్పుడు కారం ఉండే ఆహారాలను తినకూడదు. అలాగే మద్యం సేవించేటప్పుడు నూనె పదార్థాలను తీసుకోకూడదు. అలా చేస్తే లివర్‌లో కొవ్వు ఎక్కువగా చేరుతుంది. దీంతో ఫ్యాటీ లివర్ సమస్య వస్తుంది. కనుక మద్యం సేవించే సమయంలో నూనె పదార్థాలను కూడా తినకూడదు.

### పాల ఉత్పత్తులు..

కొందరు మద్యం సేవించేటప్పుడు పాల ఉత్పత్తులను తీసుకుంటారు. చీజ్, జున్ను, పాలు, బటర్ మొదలైన ఆహారాలను తీసుకుంటారు. ఇవి జీర్ణం అయ్యేందుకు సమయం పడుతుంది. ఆల్కహాల్ సేవించినప్పుడు వీటిని తీసుకుంటే జీర్ణాశయంలో అసౌకర్యం ఏర్పడుతుంది. కనుక మద్యం సేవించే సమయంలో వీటిని కూడా తీసుకోరాదు. అలాగే చీజ్ అధికంగా ఉండే పిజ్జా, పాస్తా వంటి ఆహారాలను కూడా మద్యం సేవించే సమయంలో తీసుకోకూడదు. లేదంటే అజీర్ణం వచ్చే చాన్స్ ఉంటుంది.

### పల్లీలు, పప్పులు..

మద్యం సేవించేటప్పుడు చాలా మంది పల్లీలు లేదా వేయించిన పప్పులను తింటుంటారు. వాస్తవానికి ఇలా తినడం మంచిది కాదు. పల్లీలను లేదా వేయించిన పప్పులు, ఇతర ఆహారాలను తింటే శరీరంలో కొవ్వు చేరుతుంది. ముఖ్యంగా లివర్‌లో కొవ్వు పేరుకుపోతుంది. దీంతో ఫ్యాటీ లివర్ సమస్య వస్తుంది. లివర్ ఆరోగ్యం మందగిస్తుంది. కనుక మద్యం సేవించేటప్పుడు వీటికి కూడా దూరంగా ఉండాలి. అయితే మద్యం సేవించే సమయంలో తాజా పండ్లు, కూరగాయలు వంటి వాటిని తీసుకోవాలి. గ్రీన్ సలాడ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. దీంతో లివర్ లేదా శరీరంపై పడే ప్రభావం తగ్గుతుంది. ఫలితంగా ఆల్కహాల్ మన శరీరంపై ఎఫెక్ట్‌ను చూపించదు. దీంతో లివర్‌లో కొవ్వు పేరుకుపోకుండా ఉంటుంది. లివర్ ఆరోగ్యంగా ఉంటుంది. మద్యం సేవించేటప్పుడు ఇలా సూచనలు పాటిస్తే శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. మద్యం ఎఫెక్ట్ ఎక్కువగా పడకుండా ఉంటుంది.

## మతిమరుపుని మాయం చేస్కోండి ఇలా

హెల్త్ న్యూస్ ,21 జనవరి (క్రాంతిన్యూస్ ): బండి కీ ఎక్కడో పెట్టాను అస్సలు గుర్తురావట్లేదు, అరెరె ఈరోజు నా క్లోజ్ ఫ్రెండ్ బర్త్ డే మర్చిపోయానే.. ఇలా ప్రతి ఒక్కరూ కూడా మర్చిపోయాను అని చెబుతుండడం కామన్. వయసు పెరగడం, ఒత్తిళ్లు ఇతర కారణాల చాలా మందికి మతిమరుపు సమస్యలొస్తున్నాయి. పిల్లలకి కూడా చదివింది గుర్తుండడం లేదు. దీంతో అన్నీ చదివినా పరీక్ష హాల్లో సరిగా గుర్తు రాక మార్కులు వస్తుంటాయి. ఇలాంటి సమస్యలు రాకుండా ఉండాలంటే మనం బ్రెయిన్‌ని సరిగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బ్రెయిన్ హెల్దీగా ఉంటే మతిమరుపు, ఇతర సమస్యలు రావు. అలా బ్రెయిన్ హెల్దీగా ఉండాలంటే కొన్ని అలవాట్లు చేసుకోవాలి. ఉదయాన్నే చేసే కొన్ని పనులు మన బ్రెయిన్‌ని హెల్దీగా ఉంచుతాయి. ఉదయాన్నే లేవడం చాలా మంచిది. కానీ, లేట్‌గా లేవడం, ఆఫీస్‌కి లేట్‌గా వెళ్లడం వంటివి మన బ్రెయిన్ హెల్త్‌పై ఎఫెక్ట్ చూపిస్తాయి. అలాకాకుండా సరైన మార్నింగ్ రొటీన్ ఏంటో తెలుసుకుని ఫాలో అయితే బ్రెయిన్ హెల్త్ బూస్ట్ అవుతుంది.

### నీరు తాగడం

ఉదయం లేవగానే నీరు తాగాలి. రాత్రంతా నీరు తాగకుండా ఉంటారు. కాబట్టి, డీహైడ్రేషన్ ఉంటుంది. దీని వల్ల బ్రెయిన్ పనితీరు సరిగా ఉండదు. కాబట్టి, మెంటల్ హెల్త్ బాగుంటుంది. ఎనర్జీ, కాన్సంట్రేషన్ లెవల్స్ పెరుగుతుంది. అందులో కొద్ది నిమ్మరసం కలిపితే రీఫ్రెషింగ్ ఫీల్ అవుతుంది.

### ఎండలో ఉండడం

ఎండలో ఉండడం కూడా చాలా ముఖ్యం. దీని వల్ల సెరటోనిన్, మెలటోనిన్ ప్రొడక్షన్ పెరుగుతుంది. దీంతో మూడ్, స్లీప్ సైకిల్ పెరుగుతుంది. మెంటల్లీ షార్ప్‌గా ఉంటారు. బ్రెయిన్ ఫంక్షన్ మెరుగ్గా ఉంటుంది.

### హెల్దీ బ్రేక్‌ఫాస్ట్

ఉదయాన్నే మంచి హెల్దీ బ్రేక్‌ఫాస్ట్ తీసుకోండి. పోషకాలు నిండి ఉన్న గుడ్లు, బెర్రీస్, నట్స్, హోల్ గ్రెయిన్స్ వంటి ఫుడ్స్ తీసుకోవాలి. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్స్ బ్రెయిన్ హెల్త్‌ని కాపాడుతుంది. దీంతో ఫోకస్ పెరుగుతుంది. ఏకాగ్రత పెరుగుతుంది. ప్రొడక్టివిటీ పెరుగుతుంది.

### ప్రతీది జర్నల్ చేయడం

మీరు పూర్తి చేయాల్సిన పనులు, పూర్తి చేసిన గోల్స్ వంటివాటిని ప్రతి ఒక్క విషయాన్ని రాయాలి. ఓ పాజిటీవ్ నోట్ రాయడం వల్ల మైండ్ సెట్ పాజిటీవ్‌గా ఉంటుంది. యాంగ్జైటీ తగ్గుతుంది. ఏదైనా సమస్య వచ్చినా సాల్వ్ చేసే సామర్థ్యం పెరుగుతుంది. అదే విధంగా, పజిల్స్ సాల్వ్ చేయడం, చదవడం, రాయడం వంటివి చేయడం మంచిది. దీని వల్ల బ్రెయిన్ హెల్త్ బాగుంటుంది. క్రియేటివిటీ పెరుగుతుంది. మైండ్ షార్ప్‌గా మారుతుంది.

కొద్దిగా స్ట్రెచింగ్
భారీ వర్కౌట్స్ చేయకపోయినా కొన్ని వర్కౌట్స్, యోగా వంటివి చేయాలి. దీని వల్ల బ్రెయిన్‌కి రక్త సరఫరా సరిగా ఉంటుంది. దీంతో ఎండార్ఫిన్స్ రిలీస్ అవుతాయి. దీంతో స్ట్రెస్ తగ్గుతుంది. అలర్ట్‌నెస్ పెరుగుతుంది. మీ బాడీ, మైండ్ రెండు కూడా మెంటల్ టాస్క్‌లకి సిద్ధమైపోతుంది.



దీంతోపాటు మెడిటేషన్ చేస్తే స్ట్రెస్ తగ్గుతుంది. బ్రెయిన్ హెల్త్ బాగుంటుంది. మెమొరీ పెరుగుతుంది. కామ్‌గా ఉండి కాసేపు మెడిటేషన్ చేస్తే మెంటల్ హెల్త్ బాగుంటుంది. బ్రిస్క్ వాక్, షార్ట్ వర్కౌట్ చేయడం వల్ల దీని వల్ల రక్తసరఫరా మెరుగ్గా ఉంటుంది. బ్రెయిన్ హెల్త్ బాగుంటుంది.

### ఒకే టైమ్‌కి లేవడం

రోజుకి ఒకే టైమ్‌కి లేవాలని గుర్తుపెట్టుకోండి. దీని వల్ల మన బ్రెయిన్‌కి ఓ టైమింగ్ అనేది సెట్ అయిపోతుంది. దీంతో మంచి నిద్ర కూడా మీ సొంతమవుతుంది. బ్రెయిన్‌పై నెగెటీవ్ ఎనర్జీ దూరమవుతుంది. దీంతో ఏకాగ్రత పెరగడమే కాకుండా మంచి దేని మీరు ఎక్స్‌పీరియన్స్ చేస్తారు.

సోషల్ మీడియాకి దూరంగా
వాట్సప్‌లో మెసేజెస్ వచ్చాయి, సోషల్ మీడియాలో ఏ రీల్ చూద్దాం.. ఇలాంటివన్నీ చేయొద్దు. సోషల్ మీడియాతో మీరు డిస్ట్రాక్ట్ అవుతారు. కాబట్టి, సోషల్ మీడియాకి దూరంగా ఉండండి. దీంతో స్ట్రెస్ తగ్గుతుంది. బ్రెయిన్ కూడా టాస్క్‌లు చేసేందుకు ఈజీగా ఉంటుంది.

# ఆ విషయంలో పెద్ద తేడా ఏం ఉండదు..!

స్పోర్ట్స్ న్యూస్ ,21 జనవరి (క్రాంతిన్యూస్ ):విదేశీ పర్యటనల సమయంలో ఫ్యామిలీ సపోర్ట్ అవసరమని.. మానసిక, భావోద్వేగ




సమయాల్లో వారి మద్దతు నుంచి అందుతుందని ఇంగ్లాండ్ కెప్టెన్ జోస్ బట్లర్ పేర్కొన్నాడు. ఇటీవల బీసీసీఐ ఇటీవల కొత్త పాలసీని తీసుకువచ్చిన విషయం తెలిసిందే. భారత్-ఇంగ్లాండ్ మధ్య కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో బుధవారం తొలి టీ20 మ్యాచ్ జరుగనున్నది. మ్యాచ్‌కు ముందు విలేకరుల సమావేశంలో జోస్ బట్లర్ మాట్లాడాడు. ఆధునిక యుగంలో విదేశీ పర్యటనల సమయంలో ఆటగాళ్లతో కుటుంబం ఉండడం చాలా ప్రయోజనకరంగా ఉంటుందని బట్లర్ పేర్కొన్నాడు. ఆటగాళ్లతో భార్య, పిల్లు ఉండడం భావోద్వేగంగా సోపర్ట్ ఉంటుందని.. కఠినమైన షెడ్యూల్ సమయంలో వారి మానసిక ఆరోగ్యానికి సహాయపడుతుందన్నారు. ప్రస్తుత కాలంలో చాలా క్రికెట్ ఆడుతున్నారని.. ఆటగాళ్లు ఇంటి వెలుపలే చాలా సమయం గడుపుతున్నారన్నారు. కుటుంబంతో కలిసి ఉండడం ఆటలో పెద్దగా తేడాలుండవని తాను అనుకోనని చెప్పాడు. కుటుంబం ఉండడం వృత్తిపరమైన కట్టుబాట్లకు ఆటంకం కలిగించదని బట్లర్ పేర్కొన్నారు. వ్యక్తిగతంగా, కుటుంబంతో కలిసి ఉండడం ద్వారా ఇంటికి దూరంగా ఉండడంతో కలిగే భారాన్ని తగ్గించుకోవచ్చని భావిస్తున్నానని చెప్పాడు. ఆస్ట్రేలియాలో ఘోర పరాజయం తర్వాత టీమిండియాపై బీసీసీఐ కొరఢా ఝుళిపించింది. పది పాయింట్స్ కూడిన మార్గదర్శకాలను విడుదల చేసింది. విదేశీ పర్యటనల సమయంలో ఆటగాళ్ల వెంట వారి కుటుంబ సభ్యులకు గతంలో మాదిరిగా అవకాశం ఉండదు. 45 రోజుల కంటే ఎక్కువ రోజులు సాగే విదేశీ పర్యటనలో మాత్రమే ఆటగాళ్ల కుటుంబానికి రెండు వారాలు అనుమతి ఇస్తారు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ కొత్త రూల్‌పై తన  అభిప్రాయం వెల్లడించాడు. బీసీసీఐ కొన్ని మార్పులు అవసరమని గ్రహించిందని.. జట్టులో ఐక్యతను పెంచేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తుందని తెలిపాడు.

# వుమెన్స్ U-19 వరల్డ్ కప్‌లో సంచలనం..
## హ్యాట్రిక్‌తో చరిత్ర సృష్టించిన వైష్ణవి శర్మ..!

స్పోర్ట్స్ న్యూస్ ,21 జనవరి (క్రాంతిన్యూస్ ): వుమెన్స్ అండర్-19 ప్రపంచకప్‌లో టీమిండియా బౌలర్ వైష్ణవి శర్మ చరిత్ర సృష్టించింది. మలేషియాతో జరిగిన గ్రూప్-ఏ మ్యాచ్‌లు వైష్ణవి అత్యద్భుతంగా బౌలింగ్ చేసింది. నాలుగు ఓవర్లు వేసిన వైష్ణవి ఐదు పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టింది. ఓ మెయిడెన్ ఓవర్ ఉండడం విశేషం. మ్యాచ్ 14వ ఓవర్లలో వరుసగా మూడు వికెట్ల పడగొట్టి హ్యాట్రిక్ నమోదు చేసింది. 14వ ఓవర్‌లో వైష్ణవి రెండో బంతికి నూర్ ఎన్ బింటి రోస్లాన్ (3)ను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేసింది. ఆ తర్వాతి బంతికి నూర్ ఇస్మా దానియా (0)ను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేసి పెవిలియన్‌కు పంపించింది. ఆ తర్వాత అదే ఓవర్‌లో నాలుగో బంతికి సితి నజ్వా (0) అవుట్ చేసి హ్యాట్రిక్ నమోదు చేసింది. మహిళల అండర్-19 టీ20 ప్రపంచ



కప్‌లో హ్యాట్రిక్ సాధించిన తొలి భారతీయ క్రికెటర్‌గా.. మొత్తంగా మూడో బౌలర్‌గా వైష్ణవి రికార్డులకెక్కింది. ఈ టోర్నమెంట్ చరిత్రలోనే అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలను నమోదు చేసింది. టీమిండియాకు భారీ విజయం..

వైష్ణవి బాల్‌తో రాణించడంతో మలేషియాపై భారత్ పది వికెట్ల తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసింది. అండర్-19 వరల్డ్ కప్‌లో ఇది భారత్‌కు వరుసగా రెండో విజయం. ఇంతకు ముందు వెస్టిండీస్‌పై తొమ్మిది వికెట్ల తేడాతో గెలుపొందింది. ఇక మలేషియాతో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. వైష్ణవి, ఆయుషి శుక్లా ధాటికి మలేషియా జట్టు 14.3 ఓవర్లలోనే 31 పరుగులకు కుప్పకూలింది. మలేషియా ఇన్నింగ్స్‌లో ఎవరూ రెండంకెల స్కోర్‌ను చేరుకోలేకపోయారు. వికెట్ కీపర్ నూర్ అలియా హైరున్, హుస్నా చెరో ఐదు పరుగులు చేసి టాప్ స్కోరర్లుగా నిలిచారు. వైష్ణవి నాలుగు ఐదు వికెట్లు తీయగా.. ఆయుషి శుక్లాకు మూడు వికెట్లు దక్కాయి. జోషిత వీజే ఒక వికెట్ తీసింది. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా వికెట్ నష్టపోకుండా 2.5 ఓవర్లలో 32 పరుగులు చేసింది. ఓపెనర్ జీ త్రిసా 27 పరుగులతే అజేయంగా నిలువగా.. జీ కమలిని నాలుగు పరుగులు చేసింది.

# ఎన్నాళ్లకు ఎన్నాళ్లకు..!
## రంజీ ట్రోఫీలో ఆడనున్న విరాట్ కోహ్లీ..!

స్పోర్ట్స్ న్యూస్ ,21 జనవరి (క్రాంతిన్యూస్ ):భారత స్టార్ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీ  మళ్లీ రంజీల్లోకి దిగబోతున్నాడు. దాదాపు 12 సంవత్సరాల తర్వాత రంజీ ట్రోఫీ  లో తొలి మ్యాచ్‌ను ఆడనున్నాడు. ఈ నెల 30న రైల్వేస్‌తో జరిగే ఢిల్లీ మ్యాచ్  కు అందుబాటులో



ఉంటాడు. ఈ నెల 23న సౌరాష్ట్రతో జరిగే మ్యాచ్‌కు దూరం కానున్నాడు. మెడకు గాయమైన విషయం తెలిసిందే. కానీ, రంజీ చివరి లీగ్‌మ్యాచ్‌కు అందుబాటులో ఉంటానని ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్‌కు సమాచారం ఇచ్చాడు. ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్-గవాస్కర్ టెస్ట్ సిరీస్ చివరి టెస్టు మ్యాచ్‌లో మెడకు గాయమైంది. ఆ సమయంలో ఫిజియో గాయాన్ని పరిశీలించారు.

విరాట్ చివరిసారిగా 2012లో ఉత్తరప్రదేశ్‌తో టెస్టులో ఢిల్లీ తరఫున చివరి మ్యాచ్ ఆడాడు. రైల్వేస్‌తో జరిగే మ్యాచ్‌కు విరాట్ అందుబాటులో ఉన్నట్లు డీడీసీఏ ప్రెసిడెంట్ రోహన్ జైట్లీ, టీమ్ మేనేజ్‌మెంట్‌కు తెలియజేసినట్లు ఢిల్లీ ప్రధాన కోచ్ శరణ్‌దీప్ సింగ్ మీడియాకు తెలిపారు. ఆస్ట్రేలియా పర్యటనలో విరాట్ ఫామ్ లేమితో పరుగులు చేయలేకపోయాడు. పెర్త్ టెస్ట్ రెండో ఇన్నింగ్‌లో సెంచరీ చేసినా.. మిగతా మ్యాచ్‌లలో విఫలమయ్యాడు. ఐదు మ్యాచ్‌లలో తొమ్మిది ఇన్నింగ్స్‌లలో 23.75 సగటుతో 190 పరుగులు మాత్రమే చేశాడు.

ఆస్ట్రేలియా పర్యటనతో పాటు స్వదేశంలో న్యూజిలాండ్‌తో వరుస ఓటముల నేపథ్యంలో బీసీసీఐ కీలక చర్యలు చేపట్టింది. తప్పనిసరిగా ఆటగాళ్లు అందరూ దేశవాళీ క్రికెట్‌లో ఆడాలని స్పష్టం చేసింది. ఈ మేరకు బోర్డు కొత్త పాలసీని విడుదల చేసింది. జాతీయ జట్టు, సెంట్రల్ కాంట్రాక్ట్‌కు అర్హత సాధించేందుకు ఆటగాళ్లంతా దేశవాళీ టోర్నీలో పాల్గొనడం తప్పనిసరిగా మారింది. నిర్దిష్ట పరిస్థితుల్లో మాత్రమే మినహాయింపు ఉంటుంది.

# ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్..
## క్వార్టర్స్‌లో ఓడిన బొప్పన్న జోడి

స్పోర్ట్స్ న్యూస్ ,21 జనవరి (క్రాంతిన్యూస్ ):ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ నుంచి బొపన్న  జోడి నిష్క్రమించింది. క్వార్టర్ ఫైనల్లో రోహన్ బొపన్న- షుయ్ జాంగ్ జోడి తీవ్రంగా పోరాడినా.. 6-2 4-6 9-11 స్కోరు తేడాతో వైల్డ్ కార్డు ప్లేయర్లు జాన్ పీర్స్-ఒలివియా గాడెక్కి జోడి చేతిలో ఓటమి పాలయ్యారు. కియా ఎరినాలో సుమారు గంటా 8 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్ రసవత్తరంగా సాగింది. దీంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ స్లామ్‌లో భారత ఆటగాళ్ల ప్రాతినిధ్యం ముగిసింది. మెన్స్ డబుల్స్ నుంచి కూడా బొపన్న నిష్క్రమించిన విషయం




తెలిసిందే. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో భారత టెన్నిస్ ప్లేయర్లు సుమిత్ నాగల్, డబుల్స్ స్పెషలిస్టు యుకి బాంబ్రి, ఎన్న శ్రీరాం బాలాజీ కూడా ఓటమిపాలై టోర్నీ నుంచి వైదొలిగారు. ఇవాళ జరిగిన మ్యాచ్‌లో బొపన్న-జాంగ్ జోడి.. తొలి సెట్‌ను కైవసం చేసుకున్నది. ఆస్ట్రేలియన్ వైల్డ్ కార్డు జోడిపై ఈజీగా ఆ సెట్‌ను గెలుచుకున్నది. కానీ సెకండ్ సెట్‌లో చైనీస్ క్రీడాకారిణి తన సర్వ్‌ను కోల్పోవడంతో.. ప్రత్యర్థులు బలం పుంజుకున్నారు. రెండో సెట్‌ను 4-6 తేడాతో ఆసీస్ జోడి గెలిచింది.ఇక మూడవ సెట్ ఆసక్తికరంగా సాగింది. సూపర్ టైబ్రేకర్ లో రెండు టీంలు ఆధిపత్యాన్ని ప్రదర్శించాయి. సూపర్ టై బ్రేకర్‌లో మొదటి సర్వ్‌ను బొపన్న, జాంగ్ కోల్పయాయి. ఓ దశలో 3-3కు చేరుకున్నది. మళ్లీ ఓ దశలో ఆసీస్ 7-5 ఆధిక్యాన్ని అందుకున్నది. కానీ 8-8 వద్ద బొపన్న జోడికి మ్యాచ్ పాయింట్ అవకాశం ఉన్నా.. పీర్స్ దాన్ని అడ్డుకున్నాడు.





# థ్రిల్లర్ కథతో 'ఐడెంటిటీ'



మూవీ న్యూస్ ,21 జనవరి (క్రాంతిన్యూస్ :టోవినో థామస్, త్రిష ప్రధాన పాత్రల్లో నటించిన మలయాళ చిత్రం 'ఐడెంటిటీ' తెలుగులో అదే పేరుతో ఈ నెల 24న విడుదలకానుంది. మలయాళ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించిన ఈ చిత్రాన్ని శ్రీవేదాక్షర మూవీస్ పతాకంపై చింతపల్లి రామారావు తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్మాత మాట్లాడుతూ..హత్య కేసు పరిశోధన నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించారని, త్రిష పాత్ర ప్రధానాకర్షణగా నిలుస్తుందని, తెలుగు ప్రేక్షకులు మెచ్చే అన్ని అంశాలుంటాయని అన్నారు.మర్డర్ మిస్టరీ ఛేదించే విషయంలో ఓ ఆర్టిస్టు పోలీసులకు ఏ విధంగా సహాయం చేశాడు? చివరకు హత్యా రహస్యాన్ని ఎలా ఛేదించారనే అంశాలు థ్రిల్ని పంచుతాయని నటుడు వినయ్‌రాయ్ తెలిపారు. వినయ్‌రాయ్, మందిరా బేడీ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: అఖిల్ జార్జ్, సంగీతం: జేక్స్ బెజోయ్, రచన-దర్శకత్వం: అఖిల్ పాల్, ఆనస్‌ఖాన్.

# ఏసుబాయిగా రష్మిక మందన్నా.. చావా ట్రైలర్ లాంచ్ టైం ఫిక్స్

మూవీ న్యూస్ ,21 జనవరి (క్రాంతిన్యూస్ ):పుష్ప ఫ్రాంఛైజీ ప్రాజెక్ట్‌తో నేషనల్ క్రష్‌గా మారిపోయింది కన్నడ సోయగం రష్మిక మందన్నా . గ్లామరస్ పాత్రలతో నటనకు ఆస్కారమున్న రోల్స్‌లో నటిస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తుంటుంది రష్మిక. ఈ భామ ఖాతాలో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు లైన్‌లో ఉన్నాయి. ఈ భామ నటిస్తోన్న సినిమాల్లో ఒకటి చావా . మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవిత కథ ఆధారంగా వస్తోన్న ఈ మూవీకి లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తున్నాడు.ఈ చిత్రంలో విక్కీ కౌశల్ టైటిల్ రోల్‌లో నటిస్తుండగా.. ఇందులో రష్మిక ఛత్రపతి శివాజీ సతీమణి మహారాణి ఏసుబాయిగా నటిస్తోంది. ఈ మూవీని ఫిబ్రవరి 14న విడుదల చేయబోతున్నారు. ప్రతి గొప్ప రాజు వెనుక అసమానమైన బలం కలిగిన రాణి ఉంటుంది. స్వరాజ్యం గర్వపడే మహారాణి యేసుబాయి.. అని ట్వీట్ చేస్తూ తన పాత్ర లుక్‌ను షేర్ చేసింది రష్మిక మందన్నా. ఈ మూవీ ట్రైలర్ రేపు లాంచ్ చేయనున్నట్టు ప్రకటించింది. ఇందులో రష్మిక పాత్ర చాలా పవర్ ఫుల్‌గా ఉండబోతుందని తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. కథానుగుణంగా సినిమా పూర్తిగా మరాఠీ భాషలో సాగనుందని బీటౌన్ సర్కిల్ టాక్. ఈ నేపథ్యంలో రష్మిక మరాఠీ భాష




నేర్చుకుందని ఇప్పటికే వార్తలు కూడా వచ్చాయి. మ్యాడ్‌డాక్ ఫిలిమ్స్ బ్యానర్‌పై వస్తోన్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు.

# ఓవర్సీస్‌లోనూ తగ్గేదేలే..

మూవీ న్యూస్ ,21 జనవరి (క్రాంతిన్యూస్ ):టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం సంక్రాంతికి వస్తున్నాం. ఐశ్వర్యారాజేశ్, మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటించిన ఈ మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలై బ్లాక్ బస్టర్ వసూళ్లను రాబడుతూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ మూవీ మూడు రోజుల్లోనే గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్ల మార్క్‌ను అధిగమించిన విషయం తెలిసిందే.తాజాగా మరో అరుదైన ఫీట్ నమోదు చేసింది. ఈ చిత్రం వరల్డ్‌వైడ్‌గా రూ.200 కోట్ల క్లబ్‌లోకి చేరిపోయి.. వెంకీ కెరీర్ బెస్ట్ కలెక్షన్లుగా అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. అంతేకాదు అనిల్ రావిపూడి, వెంకటేశ్, శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ హ్యాట్రిక్ కాంబోలో విడుదలై.. నార్త్ అమెరికా-2.3 మిలియన్ డాలర్లు (రూ.19 కోట్లకుపైగా) రాబట్టి.. యూఎస్ఏలో ఆల్‌టైమ్ హయ్యెస్ట్ గ్రాస్ సాధించిన సినిమాగా సంక్రాంతికి వస్తున్నాం నిలిచింది.మొత్తానికి ప్రేక్షకులు, అభిమానులు ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లోనేకాదు ఓవర్సీస్‌లో కూడా సంక్రాంతి బ్లాక్ బస్టర్ చేసి వెంకీ టీంకు ఎప్పటికీ గుర్తుండిపోయే బహుమతినిచ్చారు . ఈ చిత్రంలో నరేశ్, పాపులర్ మరాఠీ యాక్టర్, యానిమల్ ఫేం ఉపేంద్ర లిమాయే, కోలీవుడ్ నటుడు వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషించారు. ట్రయాంగిల్ క్రైమ్ డ్రామా నేపథ్యంలో వచ్చిన ఈ చిత్రాన్ని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించారు.




# రాంచరణ్ ఆర్‌సీ16 పై ఇంట్రెస్టింగ్ అప్‌డేట్..

మూవీ న్యూస్ ,21 జనవరి (క్రాంతిన్యూస్):టాలీవుడ్ స్టార్ హీరో రాంచరణ్ ఇటీవలే గేమ్ ఛేంజర్ తో ప్రేక్షకుల ముందుకు రాగా మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. ఇక బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అభిమానులను ఎంటర్ టైన్ చేసేందుకు రెడీ అవుతున్నాడని తెలిసిందే. రాంచరణ్ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి ఉప్పెన ఫేం బుచ్చి బాబు సాన డైరెక్షన్‌లో చేస్తున్న ఆర్‌సీ 16 . స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. గతేడాది నవంబర్‌లో మైసూరులోని ఛాముండేశ్వరి మాత ఆశీస్సులతో సినిమా షూటింగ్‌ను మొదలుపెడుతున్నట్టు తెలియజేస్తూ డైరెక్టర్ బుచ్చి బాబు ఫొటో కూడా షేర్ చేసుకున్నాడు. ఈ షెడ్యూల్‌లో శ్రీరంగపట్టణ బెల్లం ఫ్యాక్టరీ, మైసూరుకు సమీపంలోని మేల్కొటె టెంపుల్‌లో వచ్చే సన్నివేశాలు చిత్రీకరించినట్టు సమాచారం. తాజాగా మరో ఆసక్తికర వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. రాంచరణ్ త్వరలోనే మూడో షెడ్యూల్‌లో జాయిన్ కాబోతున్నాడట. తాజా సమాచారం ప్రకారం జనవరి 27 నుంచి హైదరాబాద్‌లో ఈ షెడ్యూల్ మొదలు కానుంది.



జులైకల్లా షూటింగ్ పూర్తి చేసి.. దసరా లేదా డిసెంబర్ మొదటి వారంలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు రెడీ అవుతున్నారని ఇన్‌సైడ్ టాక్.అంతేకాదు ఆర్‌సీ 16 కథ కేవలం ఒక్క క్రీడ చుట్టే కాకుండా మల్టిపుల్ స్పోర్ట్స్ గురించి తెలియజేసేలా ఉండబోతుందని ఫిలింనగర్ సర్కిల్‌లో వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ఇదే నిజమైతే రాంచరణ్ అభిమానులకు పండగే అని చెప్పొచ్చు. ఈ చిత్రానికి తంగలాన్ ఫేం ఏగన్ ఏకాంబరం కాస్ట్యూమ్ డిజైనర్ పనిచేస్తుండటంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి. ఈ మూవీని సుకుమార్ రైటింగ్స్-మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. ఏఆర్ రెహమాన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, మ్యూజిక్ అందిస్తున్నాడు.

Printed, Published and owned by-----------------------, Printed at -----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com